Digitized in 2006
by
Thrinaina Informatics Ltd, Secunderabad, A.P., India.
(http://www.thrinaina.com)

From the original owned by
Sundarayya Vignana Kendram
and its partner Institutions

as part of the
British Library Endangered Archives Programme
supported by the
Lisbet Rausing Charitable Fund

Except for individual research purpose
any reproduction should be made with
written permission from the

Sundarayya Vignana Kendram,
1-8-1/B/25/A, Bagh Lingampally, Hyderabad - 500 044
Andhra Pradesh, India

COPYRIGHT STATEMENT

The copyright laws of the United States (Title 17, United States Code) and of India (Copyright Act of 1957) govern the making of photocopies or other reproductions of copyrighted material including foreign works under certain conditions. In addition, the United States extends protection to foreign works by means of various international conventions, bilateral agreements, and proclamations.

Under certain conditions specified in the laws, libraries and archives are authorized to furnish a photocopy or other reproduction. One of these specified conditions is that photocopy or reproduction is not to be used for any purpose other than private study, scholarship, or research. If a user makes a request for, or later uses, a photocopy or reproduction for purposes in excess of "fair use," that user may be liable for copyright infringement.

These institutions reserve the right to refuse to accept a copy order if, in their judgment, fulfillment of the order would involve violation of the copyright laws of the United States or India.

సీతారామ, పండిత

స్వరాజ్య ధ్వజము (మూడంకముల నాటకము)

బెజవాడ, 1921

Record no. 264

Sītārāma, Paṇḍita

Svarājya dhvajamu (mūḍaṅkamula nāṭakamu)

Bejavāḍa, 1921

Record no. 264

SUNDARAYYA VIGNANA KENDRAM
1-8-1/B/25/A, Bagh Lingampalli
Hyderabad – 500 044, Andhra Pradesh, India

Bibliographic Record Target

సీతారామ, పండిత.

స్వరాజ్య ధ్వజము (మూడంకముల నాటకము) / పండిత సీతారామ విరచితము.- 1. కూర్పు.- బెజవాడ : ఆంధ్ర గ్రంథాలయ ముద్రాక్షరశాల, 1921.

(2), 79 p. ;18 cm.

Record no. 264

Sītārāma, Paṇḍita.

Svarājya dhvajamu (mūḍaṅkamula nāṭakamu) / Paṇḍita Sītārāma viracitamu.- 1. kūrpu.- Bejavāḍa : Āṃdhra granthālaya Mudrākṣaraśāla, 1921.

(2), 79 p. ;18 cm.

Record no. 264

35 mm microfilm
Image placement: IA (IIA) IB IIB Date filming began:

శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయము
సుల్తాన్‌బజార్, హైదరాబాద్. 1.

231
స-121

For REFERENCE ONLY

Bound with the Assistance of
Rajah Ram Mohun Roy Library Foundation.
Calcutta.

శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయము
సుల్తాన్ బజార్, హైదరాబాద్. 1.

ప-121

For REFERENCE ONLY

Bound with the Assistance of
Raja Ram Mohun Roy Library Foundation.
Calcutta.

స్వరాజ్య ధ్వజము.

[సమవాకారము:— (మూడంకముల నాటకము)]

పండిత, సీతారాము విరచితము.

శ్రీయు కవితా మహర్షిచే

ప్రకటితము.

మొదటికూర్పు.

ఆంధ్రభాషా ... నెం ... తేది ...

బెజవాడ

ఆంధ్ర గ్రంథాలయ ముద్రాక్షరశాలయందు

ముద్రింపఁబడియె.

1921

కాపీ రైట్] [వెల రు 0—12—0.

పీఠిక

దేశీయ సోదరులారా!

నవయుగారంభమైనది. కవులు భారత గీతములతో వాగంగనను గొనియాడుచున్నారు. దేశభక్తులు దీక్షాకంకణులై మాతృదేశోద్ధరణార్థమై ముందంజ వేయుచున్నారు. ప్రకృతిలోని చేతనవ్రాతము స్వతంత్ర జీవనము కాంక్షించుచున్నది. ఈ పవిత్ర సమయమున ప్రజోద్బోధన మొక్కటి మాత్రమే లక్ష్యమందుంచుకొని యుడతభక్తి యన్నటుల నేనీ గ్రంథమును వ్రాసినాడను. ఈ యుద్యమారంభము మొదలు నేటివఱకుఁ బ్రకటింపఁబడిన రాజకీయ నాటకములన్నింటికీ గ్రంథమే విషయమునను దీసిపోవదను నమ్మకముతో దీనినిఁ బ్రకటించితిని.

ప్రజాప్రబోధార్థమై సమకాలిక సోదర కవులు వ్రాసిన పాటలు కొన్ని యిందుజేర్చినాను; కాన నాయా కవుల కభివాదములు సేయుచున్నాడ.

ఇట్లు,

గ్రంథకర్త.

ఇందు వచ్చు పాత్రలు

పురుషులు.

విష్ణుశర్మ—బ్రాహ్మణుఁడు
రామవర్మ—పాంచాల దేశవాసి
భరత పుత్రుఁడు
లోకమాన్యతిలకు—దేశభక్తుఁడు
రామచంద్రతిలకు, శ్రీధరరావు, — తిలకు కుమారులు
కేల్కారు, కపర్ది — తిలకుయొక్క మిత్రులు
గాంధీ మహాత్ముఁడు—దేశనాయకుఁడు
షౌకతాలీ—, మహమ్మదాలీ, లాలా లజపతిరాయి, — దేశనాయకులు
చిత్తరంజనదాసు—, మోతీలాలు నెహ్రూ,
దేశ భక్తుడు

స్త్రీలు

రత్నకుమారి—పాంచాలదేశపు స్త్రీ
భరతమాత
పాంచాలమాత

స్వరాజ్యధ్వజము.

ప్రథమాంకము.

రంగము. (అమృతసరములో రాజవీధి — ప్రవేశము : —

(విష్ణుశర్మ.)

విష్ణు— (తనలో) ఓ! భరతవర్షమా! నీ పూర్వపు మహదైశ్వర్యమెల్ల గ్రంథములయందు మాత్రము నిలిచియున్నది. నిన్నుఁదన వశము జేసికొనుటకు శహాబుద్దీన్ గోరీ దేశద్రోహి యగు జయచంద్రుని యాహ్వానమున నేఁడుసారులు నీపైకి దాడివెడలి వచ్చినను, తైమూర్లంగు మొదలగువారు నీ భాగ్యమును గొల్లగొట్టినను, ననేకపర్యాయములు గజనీ మహమ్మదు దండెత్తినను, నీ యైశ్వర్యమును మాత్రము గోలుపోవక నిలిచితివి. కాని యిప్పుడుమాత్రము నీవట్లులేవు. కాలమా! నీవెంతకైనను జాలుదువు. రత్నగర్భయనఁజెల్లు నీ భరతమాతకు జనించిన సంతానమునకు గడుపునిండ తినుటకుఁ గూడును, గట్టుకొనుటకు వస్త్రమును గూడ లేకుండజేసి మిగుల దుర్దశపాలుజేసితివి. ఆధ్యాత్మికజీవనమంతరింపఁజేసితివి. స్వేచ్ఛావృత్తినశించునట్లొనర్చితివి. ప్రతివస్తువునకును విదేశము వారిని యాచించునట్లొనర్చితివి. జాతీయ పరిశ్రమలును; జాతీయ విద్యలును నడుగంటినవి. హూణ విద్య వచ్చి మానవులను పీల్చి పిప్పిచేసినది. హూణవిద్య రానివానికి గౌరవములేకుండఁబోయెనుగదా! భారతీయులెల్లరును దాస్యవృత్తిచే బంధింప బడిరి. ఎప్పటికీ కాలము మారిపోయి, భరతమాత తన సంతానముతోఁగూడ దాస్యమునుండి విముక్తిఁగాంచి సుఖించునో? కానిమ్ము. మహాత్ముండగు గాంధీ సత్యాగ్రహవ్రత మిప్పుడయం బూనఁ జనిసేయక యుండునా? (గాంధీ నుద్దేశించి)

మ॥ తనదేశీయ సహోదరుల్ మిగుల సం ♦
తాపంబునుం గాంచుటన్
గని; పూర్వస్థితిఁగూర్ప వారికి భువిన్ ♦
సత్యాగ్రహంబొండు బో
ధనగావించి యశంబునన్ వెలయునా ♦
ధర్మస్వరూపుండు, స
జ్జనసంస్తోత్రుఁడు గాంధికిన్ హరి మహా ♦
సౌఖ్యంబులన్ గూర్చుతన్.

మ॥ తన పూర్వస్థితిఁబాసి యొండ్లకడ హా ♦
దాస్యంబునన్ జిక్కి వం
తను శుష్కించెడు భారతాంబను సము ♦
ద్యత్ప్రీతినిఁదేర్ప; నె
మ్మనమం దెంచి చరించుచుండిన జగ ♦
న్మాన్యుండు గాంధీమహా
ఘనుఁ డశ్రాంతము మాకు దిక్కగునుగా ♦
కన్ గష్టముల్ దీర్పఁగన్.

ధర్మసంరక్షణార్థమై యుద్భవించిన గాంధీమహాత్ముం డాచంద్రార్కతారావనీశగధిష్ఠాయిగ నుండుఁగాక! ఈతని భగీరథ ప్రయత్నమున భారత సామ్రాజ్యలక్ష్మి యుద్ధరింపఁబడుఁగాక! భారతీయులు సత్వరస్వరాజ్యసిద్ధిని బడయుదురుగాక!

(తెరలో:—నీ యాశీర్వచన బలమొక్కటియే తక్కువగా నున్న దని భారతీయు లెదురుచూచుచున్నారు.)

విష్ణు—(ఎదుటజూచి, తనలో) పరిహాసాస్పదముగాఁ బలుకు నీతఁడెవ్వరో కదా!

రామవర్మ-(ప్రవేశించి విష్ణుశర్మను జూచి) ఏమయ్యా! గాంధిగారికి బలమైన యాశీర్వచన మిచ్చితివే! నీ వాక్యముల వలన నేమనకు స్వరాజ్యము వచ్చునట్లున్నదే!

విష్ణు—నాయనా! నీవెవ్వరవు? నేఁబలికిన పలుకులలో నేమైన దోషమున్నదా?

రామ—ఎక్కడఁజూచిన గాంధినామమే. ఎవరిండ్లో జూచిన నాతని చిత్రపటమే. ఏ వీధిలోఁజూచిన నాతని నామభజనమే. ఏమిటియీ వెఱ్ఱిగోల!

విష్ణు—బాబూ! ఇదియంతయు వెఱ్ఱిగోలగనే నీకుఁ దోఁచినదా? తండ్రీ! నీ పేరెవ్వరో వినవచ్చునా?

రామ—రామవర్మ యందురు.

విష్ణు—రామవర్మా! నీకు లోకజ్ఞానము లేక యిట్లంటివని తోఁచుచున్నది. ఇది వెఱ్ఱిగోలకాదు. గాంధీమహాత్ముని యాధ్యాత్మికశక్తియే యిందులకుఁ గారణము.

మ॥ మునులున్ జ్ఞానులు సాధుమార్గచరులే ♦
పుణ్యాత్ము జిత్తంబులన్
వినుతిం జేయుచునుందు రెవ్వఁడును నా ♦
విష్ణుండె; శ్రీగాంధియై
జననంబందెను భారతాంబకును సౌ ♦
ఖ్యంబుల్ గడుంగూర్ప; న
మ్ముని మాహాత్మ్య మెఱుంగ శక్తుఁడగునే ♦
మూఢుండు తోఁచింపుమా.

ఆతడు శక్తిసంపన్నుడగుటచే, మహదౌన్నత్యమును గోలుపోయి, దుర్భరదారిద్ర్య నిపీడితయై దాస్యబంధనంబులఁ గట్టుఁబడియున్న భారతలక్ష్మిని నుద్ధరించుటకు గంకణముధరించి, దౌర్జన్యరహితమగు సత్యాగ్రహ

వ్రతమును భారతీయులలోఁ బ్రవేశపెట్టి హిందు మహమ్మదీయ జాత్యైక్యతను నెలకొల్పెఁనాఁడు.

రామ— మీవంటి పదినుండి బ్రాహ్మణులుంటే స్వరాజ్యప్రాప్తికేమి కొదవ. ఒకరినిఁబొగడుటలో మిమ్ము మించినవారులేరు. అనరాదు గాని యీదేశ దారిద్ర్యమునకు బ్రాహ్మణులే కారణులు.

విష్ణు— నాయనా! నీకంటెఁ బెద్దవాడను. నీవన్నంత మాత్రముచేత నాకు గోపము జనింపదు. నీవలన మాజాతి దూషణ ప్రాయమగుట మా పురాకృత ప్రారబ్ధము గాని మఱియొకటి కాదు. కాకున్నచో ధరామరుల ప్రభావము మీకు మాత్రము దెలియదా? మున్ను భారతరణమునఁ గౌరవుల పక్షమున నిల్చి, యరిసేనం దెగటార్చిన ద్రోణాచార్య కృపాశ్వత్థామలు బ్రాహ్మణులుగారా? పితృవధాసంజనిత క్రోధమున నిరువదియొక్కసారులు క్షత్రియానీకంబును వధించిన పరశురాముఁడు బ్రాహ్మణుఁడుకాఁడా! ఇంతయేల! నిన్న మొన్నటివాఁడు ఖడ్గతిక్కన. అతఁడొనర్చిన యుద్ధరంగమున రక్తపు దడియింకను నారలేదే. తపోవృత్తి, వైదికాచారములతోఁ బాటు బ్రాహ్మణులకు గూడ శౌర్యపరాక్రమము లున్నవని యెఱుంగుము. కాని యవి యన్నియుఁ గాలగర్భమునఁబడి మాయమై పోయినవి.

రామ— పాపము! లేకపోతే యీపాటికిమీరు భారతవర్షము దగులబెట్టియే యుందురు కాబోలు! అయితే యీగాంధి ప్రవేశపెట్టిన సత్యాగ్రహము తప్పక భారతీయులకు స్వరాజ్యము జేకూర్చుననియేనా మీ యభిప్రాయము.

విష్ణు— అందుకు సందియమేమున్నది. గాంధీ మహాత్ముఁడు పట్టినపట్టు విడుచువాఁడు కాఁడు.

సీ॥ దక్షిణాఫ్రిక భార♦తజనుల కష్టముల్
దొలఁగించి, కీర్తితోఁ ♦ వెలుఁగి నాఁడు.

చాంపరాన్ పురిని హిం♦సలఁ బడు కూలీల
బాధలఁదొలఁగించి ♦ బఱఁగినాఁడు
కైరాప్రదేశంబు ♦ కఱవున గుందంగ
దత్ప్రజలను గృపం♦దనిపి నాఁడు
సకల దిక్కులయందు ♦ సత్యాగ్రహవ్రత
భేరిని మ్రోగించి ♦ వెలిఁగి నాఁడు
తే॥ గీ॥ ధర్మసంస్థాపనార్థమై ♦ ధరను జనన
మందినాఁ డట్టి గాంధి ప్ర♦యత్నములు స
ఫలితములు గాక యుండునే ♦ భారతీయు
లంద కుందురె మోదంబు ♦ నాత్మలందు .

రామ— మీ యభిప్రాయమేమో నాకు సంపూర్తిగ దెలియలేదు. స్వరాజ్యమనఁగా బ్రిటిషువారు లేకుండ మనవారే రాజులయి యుండవలయుననియా? ఎంతమాటంటివయ్యా! ఈహూణ ప్రభుత్వమున మనకుఁ గలిగిన సౌఖ్యముల నీవు గ్రహించియు నిట్లు పలుకుచున్నందులకు నవ్వు వచ్చుచున్నది. ఈ హూణ రాజ్యపరిపాలనా విశేషమును వర్ణింపఁ దరముగాదు సుమా!

సీ॥ దండుగాఁ జేరుచు ♦ ధనము గొల్లగొనెడు
పిండారి పిండులు ♦ చెండఁబడియె
దారుల సరికట్టి ♦ ద్రవ్యవంతులఁ గూల్చు
ఘూర్కాజనంబులు ♦ గూల్పఁ బడిరి
థూ మతంబునుజేరు ♦ మాయని బలవంత
పెట్టెడిపాలన ♦ మట్టిఁగలిసె
అరిబాధయను మాట ♦ ధరణికిలేకుండ,
సతినేర్పుతోఁడఁజే ♦ యఁగఁబడియె

తే॥ గీ॥ హాయిగా గుండియలపైనఁ ♦ జేయిపైచి
నిద్ర బొందఁగవచ్చు నీ♦నేలయందు
భళిర! మనహూణ జనపరి ♦ పాలనమునఁ
దరమె దీనినిఁ బొగడంగఁ ♦ దలఁచి చూడ.

మ॥ చనరానట్టి ప్రదేశముల్ చనుటకై ♦ సౌకర్యమేర్పారె; ని
ర్జనభూముల్ ఘనపట్టణంబు లగుచున్ ♦ రాజిల్లె; నుగ్రాటవుల్
వనులై భాసిలె; నిక్కమారయ సదా ♦ భద్రంబు జేకూరె నీ
మన దేశంబున వారిపాలనమునన్ ♦ క్ష్మాదేవ వంశోత్తమా.

ఇది యట్లుంచుము. మున్నెన్నఁడైన మన తాతలుగాని వారి ముత్తాతలుగాని యీ ధూమ శకటములు, తంతివార్తలు, తపాలు, నదులపై వంతెనలు మొదలగునవి చూచి యుండిరా! కాశికిబోయినవాఁడును గాటికిఁ బోయినవాఁడును నొక్కటే యను మాట వీరి పాలనమున మఱుపునకు వచ్చెను గదా. సకలవిద్యలను నేర్చుకొనుట కెన్ని కళాశాలలు నిలుపఁబడినవి. న్యాయముదీర్చుట కెన్ని కోర్టులుండెను. రోగుల కుచితముగ నౌషధములనిచ్చు వైద్యశాలలు లెక్కింపఁదరమా! ఇవి యన్నియు మఱచి నేటికి హూణపరిపాలనము బాగులేదు, స్వరాజ్యము కావలెనని పలుకుచుంటివి.

విష్ణు—రామవర్మా! ఆంగ్లేయులు మన భారతదేశమున నివి యన్నియు జేయుట, "ఎఱ్ఱజూపి చేఁపను" బట్టునట్టి విధమే. నీవు చెప్పిన సౌకర్యములన్నియు నింతకు ముందున్న పూర్వరాజులుగూడఁ జేసినారుఁ కాకున్నచో మనజాతీయ పరిశ్రమ లడుగంటఁజేసిన యిప్పటి యంత్రములు లేకున్నమాటెకాని తొలుత నుత్తర ప్రత్యుత్తరముల రాకపో

మార్గమునిఁ బెట్టినవాఁడు ఢిల్లీపాలించిన అక్బరుష్. వ్యవసాయార్థమై కాలువలు త్రవ్వించినది ఫిరోజిషా. ఇది యంతయు నేల! చక్రవర్తి రాజ్యపరిపాలనమున నీ కొఱంత యున్నదని వ్రేలు మడఁచిచెప్పుటకు వీలున్నదా! నాయనా! ఎందుకు జెప్పెదవు! వీ రిది యంతయు చేయుట మనలను సన్యాసులను జేయుటకే! ఈహూణవిద్య నిజముగా భారత విద్యార్థులను దుర్బలులఁ జేసిన దని నానిశ్చయమైన యభిప్రాయము. దీనిచే దేశభాషలన్నియు వినాశన మందెను. మన కృషులు నశించినవి. ఘోరదారిద్ర్యదేవత మనల నావహించినది. మనకెక్కడను స్వాతంత్ర్యము లేదు. దొరతనమువా రిష్టము వచ్చినట్లు మనపైఁ బన్నులు విధించుచున్నారు. ఇందుచే మనవారు స్వాతంత్ర్యము నభిలషించుచున్నారు.

రామ—ఈగోల యంతా స్వాతంత్ర్యము కొఱకేనా?

విష్ణు—ఇంకను సంశయమేమున్నది? మానవుం డెప్పుడును స్వాతంత్ర్యమును ప్రాణముకంటె నెక్కుడుగాఁ జూచుకొనును. ప్రతిమానవుఁడు తాను చిక్కుబడియున్న బంధములనుండి విముక్తినందగోరును; కాని కొందఱు స్వార్థపరులు మాత్రమీ స్వాతంత్ర్యము నభిలషింపరు. వీరెప్పుడును దమ లాభమునే కోరుకొనుచుందురు. ప్రతిజీవుని హృదయమున నీ స్వాతంత్ర్యాపేక్ష యెప్పుడును రహస్యముగ డాగియుండి, సమయము వచ్చినప్పుడీవలకుఁ బ్రజ్వరిల్లును. మానవునకు స్వాతంత్ర్యము కన్న మోక్షము లేదు. ఈ స్వాతంత్ర్య మహానందము బొందుటకే మునీశ్వరులు తపోవృత్తి నవలంబించిరి. దేశభక్తులు తమ సర్వస్వమును ధారపోసిరి. యోధులు రణరంగములయందు ధర్మ సంరక్షణార్థమై తమ శరీరము నుండి రక్తము ప్రవహింపఁ జేసిరి. నేఁడు భారతవర్షమున మహమ్మదీయులు హిందువులతోఁ గలసి తమ మత ధర్మములను గాపాడుకొనఁ జూచుచున్నారు. భారతభూమి స్వాతంత్ర్యము వహింపఁ గోరుచున్నది. సత్యస్వరూపుఁడైన గాంధి యీ భారత మాతకుఁ దొల్లిటి వైభవము గూర్ప యత్నించుచున్నాఁడు. అతని ప్రయత్నములు జూడ మన మచిర కాలములోనే స్వరాజ్యము నందగలమని తోచుచున్నది.

రామ— స్వరాజ్యమనఁగా నింగ్లీషు వారితోఁ బ్రతిఘటించి నిలిచి తెచ్చుకొనవలయుననియా నీతలంపు!

విష్ణు—నీవు చదివిన చదువు తుదకిట్లు పరిణమించినది. నీ వెంతయు దురభిప్రాయబడితివి. స్వరాజ్య మనఁగా వారితో బోరాడి రక్తపాతము జేయుట కాదు. వారి రాజ్యాంగపద్ధతులు మార్పనందవలెను. వారు మనపై నిరంకుశాధికారమును వహించియున్నారు. మన "అర్థము ప్రాణము" వారి చేతులలోనున్నది. స్వరాజ్యము మనజన్మహక్కై యున్నది. ఇంగ్లాండువారును, జపానువారును, అమెరికావారును నెట్లు స్వాతంత్ర్యసుఖములఁ నొందుచుండిరో యట్లే మనము బొందవలయును. ఇంతవఱకును ప్రభుత్వమువారు మనభరతవర్షముపై వచ్చునాదాయమును వారి చిత్తము వచ్చినట్లు ఖర్చుపెట్టుచున్నారు. ఇష్టమువచ్చిన పన్నులను వేయుచున్నారు. తమకు వీలయిన చట్టముల నిర్మించుచున్నారు. అందుచేత నింక ముందిట్లుగాక, ప్రజాభిప్రాయమును, ప్రజాసౌఖ్యమును నెఱిఁగి వారు ప్రతికార్యమును జేయవలయునని మన కోరిక.

రామ—ఈవిషయమై చాలాగోజులనుండి తగాదాగా నున్నదికదా,

విష్ణు—అవును. మనకోరికను వారంగీకరించినారుకాని, మనకు స్వరాజ్యమిచ్చినచో వారియాటలు సాగవని యిదుగో అదుగోయని కాలహరణము సేయుచు, నెమ్మదిగా నేదియో యాసజూపి మహమ్మదీయులను మనలోనుండి చీలదీసిరి. కానిఆ మధ్య జరిగిన బాల్కను యుద్ధమువలనను, జర్మనీ యుద్ధము వలనను తుర్కీ విషయమై యింగ్లీషువారు తమకు జేసిన యన్యాయము వలనను మహమ్మదీయులు వారిగుణమును పూర్తిగ గ్రహించి స్వరాజ్య సంపాదనకై మనతోఁ బాటు ప్రయత్నములు జేయుచుండిరి.

రామ—ఏమిటో ! చెప్పదలచుకొన్నచో ననేకము లున్నవి. ఈస్వరాజ్యమను పదమును బూర్వము మనవా రెన్నడైన నెఱుగుదురా ?

విష్ణు—అయ్యా ! రామవర్మగారూ! ప్రాచీన హిందూరాజ్య తంత్రమును గూర్చిన జ్ఞానము మీ కావంతయు లేదని నేను నొక్కి వక్కాణింపఁగలను. వేదయుగమునందు నృపాలుఁడు నిరంకుశుఁడు గాడనియు, ప్రజాప్రతినిధుల యనుమతిని సకలకార్యములును నెరవేర్చుచుండెననియు జెప్పబడియున్నది. క్షాత్రయుగమునందుగూడ రాజును నెన్నుకొనుటకు ప్రజలయభిప్రాయము కావలసినట్లు రామాయణమునందు గానిపించుచున్నది. జరాభార పీడితుడైన దశరథుడు తనరాజ్య భరమును శ్రీరాముని భుజస్కంధముపై మోపదలంచి, నానాదేశ రాజులను, మిత్రులను, బంధులను రాష్ట్ర పౌరజనులను రావించి యొక పెద్దసభ జేసి, వారిని విలోకించి,

"ఉ॥ ఇచ్చటఁ జేరియుండెడి ద్వి♦జేంద్రుల కందరి కిష్టమేని; మీ
రిచ్చిన నౌనటంచ నెద♦రేని, మదాదిమ పుత్రు రామునిన్
గ్రచ్చఱ ధూతశాత్రవుఁ బు♦రందరసన్నిభు ధార్మికాగ్రణిన్
సచ్చరితున్ మహామహుని♦సర్వగుణంబులమత్సమానునిన్."

రాజుగా జేయ నెంచితిననియు, మీ కిష్టము లేకుండెనేని మీకుదోచిన తెఱంగు జెప్పు"డని పలికెను. అందుపై రామాభిషేకమునకు సభ్యులు సమ్మతించిరి. భారతమునందు గూడ నిందులకు నిదర్శనమున్నది. ప్రతీపుడు తన జ్యేష్ఠసుతుడైన దేవాపికి బట్టముకట్ట నెంచగా, ప్రజలును బ్రాహ్మణులును నందుల కడ్డుపెట్టి రెండవతనయునకు రాజ్యాభిషేకము చేయించిరి. కావున మనకుగూడ ప్రజాప్రతినిధి మూలకముగ మనరాజ్యతంత్రము నడిపించుకొను స్వాతంత్ర్యము బ్రిటిషువారు మనకొసంగినగాని మనదారిద్ర్యము తొలగదు. భారతదేశము పూర్వౌన్నత్యమును బొందదు.

(తెరలో—మహాత్మాగాంధీకి జయ్, అను శబ్దము వినవచ్చును.)

రామ—ఏమండీ ! తాళాలు, తప్పెట్లు, అట్టహాసముగా భజనచేయుచూ చాలామంది బయలు దేరినారు. ఈ వాళ యీ హడావిడి యేమిటి.

విష్ణు—అరుగో వా రీమార్గముననే వచ్చుచున్నారు.

[ఒక భజన సమాజము–ప్రవేశించి)

భ ర త మా త .

విన్నపమాలించు భరతమాతా – కన్నతల్లివీవె మాకు భరత॥
పాడిపంటలతోడ–భరతమాతా–మమ్ము సాకుచుంటివి భ॥
దుష్యంతుఁడాదిగా నృపులు–భ–నిన్నుఁ బ్రేమించి మించిరి భ॥
ధర్మనందనుఁడు నిన్ను– భ– గౌరవమునఁ గాంచె భ॥
దుష్టుల శిక్షించి భ – యిష్టముఁ దీర్చెఁ బరీక్షిత్తు భ॥
చెప్పిన సిగ్గౌను భ – చెప్పకుండిన ముప్పౌను భ॥
ముప్పువచ్చెను మాకు భ – తప్పించి రక్షింపు భ॥
మాభాగ్యాభోగాలు భ – పరదేశజులపాలయ్యె భ॥
స్వాతంత్ర్యనాశంబు భ – చేకూరె మాకును భ॥
మాగోడు వినరెవరు భ – మమ్ము గాపాడుమాయమ్మ భ॥
మావిద్యలన్నియు భ – మన్నులోపల గలిసె భ॥
మాచేతిపనులన్ని భ – కానంగరాకుండె భ॥
కట్టుబట్టకుగూడ భ – యొరుల యాచింపనయ్యె భ॥
దాస్యబంధముల భ – గట్టుబడియుంటిమి భ॥
రాష్ట్రీమేలెడువారు భ – ధర్మంబుజూడరు భ॥
ఇందులకేమందు భ – మాసౌఖ్యముల జూడరు భ॥
మాకాయువు, మాకారోగ్యం భ – యనుచుండ్రు వారు భ॥
మాదాస్యము వీడగ భ – మార్గమేమిటి తెల్పు భ॥
నిన్ను జూచిన మాకు భ – కన్నుల నీరొదవు భ॥
ఎట్టివైభవము నీవు భ – మున్నొందియుంటివి భ॥
నేఁడెట్టియిక్కట్లు భ – గూడియుండెను నీకు భ॥

కూర్చుంటె పోటు భ – వంగుంటె పోటు భ।
వర్తకమను పేరుతో భ – వచ్చినారు వారు భ॥
వచ్చి నిన్ను మెచ్చినారు భ – బంధించి మించినారు భ॥
రౌలత్తు శాసనంబు భ – దానికేమిదారి భ॥
మాలనున్నవారి భ – రచ్చకీడ్చినారు భ॥
ఉన్నమాటకులుకు భ – నోళ్లుమూయుచుండ్రి భ॥
ధర్మమెల్లబోయె భ – మాకర్మమిట్లుండె భ॥
క్రొత్తక్రొత్త "ఆక్టు" భ – కొంపదీయుచుండె భ॥
బిరుదాళి కాసించి భ – మావారె కొంపముంతురో భ॥
నెత్తిమీఁదకొచ్చినా భ – బుద్ధిలేదు వీరికి భ॥
మాపూర్వజ్ఞానంబు భ – మఱచిపోయినాము భ॥
పూర్ణనిద్రలోన భ – మునిగియున్నవారము భ॥
గాంధిబోధవలన భ – కన్ను తెఱచినాము భ॥
మమ్ము వృద్ధిలోకి దెమ్ము భ – నిన్ను నమ్మియున్నాము భ॥
(అందరు జయ్ గాంధీమహాత్మకు జయ్ అని నిష్క్రమింతురు.)

విష్ణు—రామశర్మగారూ! చూచితిరా; దేశమే స్థితిలోనున్నదో మనభారతీయు లెట్టి దుర్దశల నందుచుండిరో. మొన్న మన భారతసమువారు మన దేశములోఁ బ్రవేశపెట్టిన రౌలతుశాసనమునుగూర్చి వింటిరికదా మన భారతవర్షమునం దెన్నఁడెఱుఁగని తీవ్రాందోళనకును, ప్రతిఘటనలకును గారణమైనది యీ చట్టమే. ఇట్టి విపరీతచట్ట మనవసరమనియు, నియ్యది భారతీయులకు గౌరవహానియనియు, దీనిని రద్దుపఱచవలెనని గాంధివాక్యముల ననుసరించి నేఁడీ పాంచాలురు సత్యాగ్రహవ్రతము బూనినారు. నేఁడొక్క పాంచాలవాసులేగాక భరతవర్షమున నఖిలజనులును దౌర్జన్యరహితమైన యీ సత్యాగ్రహమును బూనుదురు.

రామ—ఈ సత్యాగ్రహవ్రతము బూనినంతమాత్రముననే రౌలతు శాసనమును దొరతనమువారు రద్దుపఱచి మనకు స్వరాజ్యమనుగ్రహించెదరా యేమి? మనమందరమును ప్రభువులమీద నాగ్రహించినచో వారికేమి కొఱత!

విష్ణు—ఈ సత్యాగ్రహవ్రతముయొక్క యర్థము మీరు సంపూర్తిగ గ్రహింపలేదని నా యభిప్రాయము. రౌలతుశాసనము ప్రవేశపెట్టబడిన త్రువాత ఈ విషయమై గాంధీమహాత్ము డిట్లు చెప్పియున్నాడు.

"సత్యాగ్రహము స్వయంవ్యక్తిత్వముగలది. దీనిని బ్రయోగించుటకై ప్రతిపక్షుల సమ్మతిం బడయ నక్కఱ లేదు: ఇది స్వయంజ్యోతి: ప్రతిపక్షు లెదిరించినకొలదిని నిది తీక్ష్ణతరముగ బ్రకాశింపుచుండును. కనుక నిది దుర్భేద్యమైనది. దీని నెదిరించుట కెవరికిని శక్తి చాలదు. పరాజయ మన నేమియో "సత్యాగ్రహి" యెఱుంగ జాలడు. ఏల యనగా సత్యమునకై యాతడు పోరాడుచుండును. ఈ పోరాటములో మృతుడైన యతనికి మోక్షమే లభించును. కారాగారమున బంధింపబడిన నది యాతనికి మోక్షద్వారమే యగును.

*　　　*　　　*　　　*

రౌలతు బిల్లులను బ్రచురింపగనే నేను వానిని జూచితిని. మానవజాతియొక్క జన్మస్వాతంత్ర్యముల నవి చంపివేయునవిగ నాకు గానుపించినవి. గనుక వీనిని యంతమొందించు వఱకు నెదిరించి తీరవలెనని నాకు గట్టిగ దోచినది. నేనే గాక భారతీయు లెల్లరును దీని నెదిరించుచుండిరని నే గనుకొంటిని. ప్రపంచములో నెంత నిరంకుశాధికారముగల ప్రభుత్వమునకైనను, సర్వప్రజలకును నసహ్యకరమైన శాసనముల నిర్మించుట కెట్టి హక్కును లేదు. అట్టితరి న్యాయబద్ధమును సత్సంప్రదాయాచారములును గలిగిన మన హిందూదేశ ప్రభుత్వమువారికి నిట్టిహక్కు బొత్తుగ నుండజాలదని మనవి జేసికొనుచున్నాను. మఱియు దీనిని గూర్చి దేశమునం దుద్భవించుచున్న యాందోళన, దౌర్జన్యమార్గములను బట్టి చెదరిపోకుండ గాపాడుటకై దీనిని ఖండిత మగు మంచిమార్గములోనికి ద్రిప్పవలసిన యావశ్యకము కలదని నే దలంచితిని."

రామ—మొత్తముమీద నీగాంధి మహా సాహసుడని చెప్పక తప్పదు. కాని, ఈతని యుద్యమ మెంతవఱకు ఫలితము జెందునో చెప్పలేము.

విష్ణు—ఫలితము జెంది తీరును.

తే॥ గీ॥ అద్ది, సత్యాగ్రహవ్రతా ♦ ఖ్యాస్త్ర; మందు
గాంధిచే విడువంబడియెం ♦ గాన; విజయ
మంది భారత సూనులా ♦ నంద మంది
చెలగ కుందురె పూర్వపు ♦ శ్రీలగాంచి.

(ఇంచుక యూరకుండి) రామవర్మా! ఇంతకుముందు నీకున్న మలిన భావమును విడిచివేయుము. రమ్ము. దేశభక్తులగూడుము. దేశసేవ జేయుము బ్రాహ్మణాబ్రాహ్మణా భావమును పరిత్యజింపుము. జాతీ యైక్యత యున్నగాని భరతవర్ష ముద్ధరింపబడదు. మనభూమి సామాన్యమైనది కాదు. (చేయిబట్టుకొని) దేశీయసోదరా!

"౧. శ్రీలుపొంగిన-జీవగడ్డయి-పాలుబాఱిన-భాగ్యసీమయి
వ్రాలినదియీ-భరతవర్షము-భక్తి పాడర-తమ్ముడా!
౨. వేదశాఖలు - వెలసెనిచ్చట-ఆదికావ్యం-బలరెనిచ్చట
బాదరాయణ-పరమఋషులకు-పాదుసుమ్మిది-తమ్ముడా
౩, విపినబంధుర--వృక్షవాటిక-ఉపనిషన్మధు-వొలికెనిచ్చట
విపులతత్త్వము-విస్తరించిన-విశ్వమణియిదె-తమ్ముడా!
౪. సూత్రయుగముల-శుద్ధవాసన-క్షాత్రయుగముల-చండ
శౌర్యము
చిత్రదాస్యము-చేచరిత్రల-చెఱిగిపోయెర-తమ్ముడా!
౫. మేలికిన్నెర మేళవించి-రాలుగరగగ-రాగమెత్తీ
పాలతీయని బాలభారత-పదముపాడరతమ్ముడా!

౬. నవరసమ్ములు-నాట్యమాడగ-చివురుపలుకులు-జెవుల
విందుగ
కవితలల్లిన-కాంతహృదయుల-గారవింపర-తమ్ముడా!
౭. దేశగర్వము-దీప్తిజెందగ-దేశచరితము-తేజరిల్లగ
దేశమరసిన-ధీరపురుషుల-తెలిసిపాడర-తమ్ముడా!
౮. పాండవేయుల-పదునుకత్తులు-మండిమెఱసిన-మహితరణ
కథ
కండగలచిక్కని-తెనుంగుల-కలిపిపాడర-తమ్ముడా!
౯. లోకమంతకు-కాకపెట్టిన-కాకతీయుల-కదనపాండితి
చీకిపోవని-చేవమాటల-చేర్చిపాడరతమ్ముడా!
౧౦. తుంగభద్రా-భంగములతో-పొంగినింగిని-పొడిచిత్రుళ్ళి
భంగపడని తెనుఁగునాథుల-పాటపాడర తమ్ముడా!
౧౧. పసుపుకొంగుల-ముసుగు లెడలగ-కొసలుతీర్చిన-కోరకత్తుల
కసరిపోరిన-గండుయోధుల-యశముపాడర-తమ్ముడా!"

రమ్ము- మనముగూడ నా సత్యాగ్రహవ్రత సమాజము వెంట బోవుదము.

(ఇరువురును నిష్క్రమింతురు.)

రంగము;-(పాంచాలపరిసర వనము. భరతపుత్రుని ప్రవేశము.)

భ-పు-(స్వగతము) తల్లిగారి నియోగమున యావద్భారతవర్ష సంచారారమై బయలుదేరి యందందుఁ జరించి నేఁడిక్కడకుఁ జేరుకొంటిని. (పరికించి) ఓహో! ఇయ్యది పాంచాల భూమివలెనున్నదే! ఈ ప్రదేశము జూచినంతనే నా మేనఁ బులకలు వొడముచున్నవి. ఈ ప్రదేశము పురాణములయందును, చరిత్రముల యందునుగూడ ప్రసిద్ధికెక్కి నాటికిని నేటికినిఁ దన శౌర్యమును విడువకయున్నది. మహాభారత కావ్యమునఁ గురుక్షేత్రమనియు, శమంతక పంచకమనియు వర్ణింపఁబడినది యీప్రదేశమేకదా! త్రేతాయుగాంతంబునఁ బరశురాముఁడు పితృవధాపంజనిత క్రోధాగ్నిజ్వాలల జల్లార్చుకొనుటకై మదాంధులైన భూపతుల గళంబులను, నిజహస్తాలంకృత కృపాణంబున నిఱువది యొక్కమారులు ఛేదించి, తద్రక్తమునఁ బితృక్రియలఁదీర్చి తత్కళేబరంబులను నిర్జరలోకమునకు సోపానములుగ జేసి మించుట యీస్థలంబునందేకదా! ఇచ్చటనే కురుపాండవయోధులు రాజ్యభాగ విషయమున, బదునెనిమిది దివసంబులు ఘోరసంగ్రామమాచరించిరి. ఈ ప్రదేశమే వేదకాలమున నార్యుల కాదిమ నివాసమైయొప్పెను. ఇచ్చటనే ఋషులు వేదములను తొలుతగానము జేసిరి. మున్నునేకులు భారతదేశలక్ష్మిని హరించుటకువచ్చి యీ పాంచాలపుత్రుల శౌర్యమునకోడి వెన్నిడిరి. మున్నీ భారతవర్షము పైకి దండెత్తి వచ్చిన యలగ్జాండరు విజయలక్ష్మీలాలితుండైనను, మఱికొన్ని దినముల కీప్రదేశముననే పురుషోత్తముఁడను రాజుచే భంగమొందెను. (పరికించి) ఓహో! ఇది అమృతసరము వలెనున్నది. ఈనగరమునకు సిక్కులనువర్ణ దేవాలయమెంతయు వన్నెదెచ్చుచున్నదిౕ (యించుక యూరకుండి) నేనిట్లాలోచించుచుఁ గాలయాపన జేయరాదు. భానుఁడుగూడ నస్తగిరిఁజేరు సమయ మాసన్నము కానున్నది. నే నీరాత్రి కీప్రాంతమునందే వృక్షము క్రిందనైన విశ్రమించి తెల్లవారిన పిదప నీ నగర విశేషముల నారసెదగాక! అదిగో! ఎదుట దట్టమైన యొక వృక్షము కనిపించుచున్నది. అచ్చోటికిఁ జేరెదఁగాక. (నడిచి వృక్షమును సమీపించి) ఓహో! ఇది సహకార భూజము. దీని నామము సార్థకమైనది.

సీ॥ చిగురుజొంపముల మ♦చ్చికఁదిన నలవడి
కోయని కోకిలల్ ♦ కూకలిడియె
గమగమ వలచు చ♦క్కని పూవుగుత్తులఁ
జూచి తుమ్మెదలు జుం ♦ జుమ్మనియె

పలకబాఱిన తీయ ♦ పండ్లను రుచిచూచి
చిలుకలు పలుకుల ♦ కులుకు లందె
నీడంబులన్ బసి ♦ నిసువుల మేపుచు
దద్దయు గువ్వలు ♦ ముద్దులాడె

తే॥ గీ॥ కోటరంబుల ఘూకముల్ ♦ గుట్టు వట్టె
గొలఁకు జక్కవల్ పోరిఁబోరిఁ ♦ గూర్మిగాంచె
నచ్చు టచ్చట శారికల్ ♦ ముచ్చటించె
దాన సహకారనామంబు ♦ ధన్యమయ్యె.

(వృక్షముక్రింద నాసీనుఁడై) అప్పుడే అంధకారము దిశల నావరించినది. మార్గాయాసమున డస్సియున్న నాకీ మందమారుత మెంతయు సౌఖ్యముగ నున్నది.

చ॥ మలయగిరిన్ వసించి యల♦మానస దివ్యసరంబునీది యా
వలిమల నాటలాడి నవ♦పల్లవపాళిఁ గదల్చి మల్లికా
కుల వకుళామ్రకేతకుల♦కూటము లంది మరందమాని, మ
త్తిలి ఘనసార వాసనల♦దేలి సమీరుఁడు వీచె మెల్లఁగన్॥

(ఇంచుక యూరకుండి) ఇంతవఱకును మహోల్లాసముననున్న నాచిత్తమున నాందోళనము జనించుచున్నది. ఇందులకుఁ గారణమేమై యుండును. ఏ పట్టణమునఁ జూచినను హూణ రాజ్యాంగము అధర్మపథము బట్టినదను మాటయే వినవచ్చుచున్నది. ఎచ్చటఁజూచినను భారతీయుల దురవస్థలే వినవచ్చుచున్నవి. ఇక్కడఁగూడ నట్టిదేదైన విన వచ్చునా యేమి!

(తెరలో)

సీ॥ అర్ధాంగినౌ నన్ను ♦ నవనిపై విడనాడి
యరుగుట ధర్మమా ♦ వరగుణాఢ్య

చెలువారుప్రేమ, నేఁ ♦ జేయు సేవల పైన
విసుగు బుట్టెనె నీకు ♦ వీరచరిత
ఎన్నండు నినుబాసి ♦ యెఱుగని నాకును
దిక్కేమి యింకపై ♦ ధీరపురుష
స్నేహబృందము మూటఁ ♦ జెవిఁజేర్ప కీర్తి
నరుదెంచి యిల్లైతె ♦ యమలభావ

తే॥ గీ॥ హా! మనోనాథ! జితచంద్ర ♦ హాసుచరిత!
హా! నిరంతర కరుణామ ♦ యాంతరంగ!
హా! మదీయ ప్రాణధనమా ♦ హా! సురూప
హా! భరత దేశసద్భక్త ♦ హా! గుణాఢ్య.

(అను పద్యమును జదువుచు రత్నకుమారి ప్రవేశించును,)

భ-పు—(తనలో) ఎక్కడిదీ యార్తరవము! స్త్రీకంఠమువలెనున్నదే!

రత్న—హా! ప్రాణేశ్వరా! నేటిదినమున "జలియన్‌వాలాబాగు" నందు జరుగు సభ కరుగవలదని నేనెంత నొక్కి వక్కాణించినను వినక యి ట్లరుదెంచితివి. మున్నెన్నడును భారతవర్షమున జరుగని దుర్గతి నేడీ పాంచాల వాసులకుఁ గల్గెనుగదా. ఎవ్వరో యజ్ఞానులు స్వల్పమైన యల్లరిఁ జేసినఁ జేసియుందురుగాక! అంతమాత్రమున, సాధవశాంగుడు సభకై గూడిన జనముపైఁ దుపాకులఁ గాల్చ నాజ్ఞనిడుట యేటిధర్మము. ఈ రాత్రిసమయమున నీమృత కళేబరము నాకెచ్చటఁ గనిపించును. (దీపమువెలుతురున వెదుకుచు) ఆహా! ఈ ప్రదేశమంతయు మృతకళేబరములతో నిండియున్నది. వీరందఱును రాజద్రోహము దలపెట్టిన వారలేనా! కటకటా! వీ రెట్టి దుర్మరణమందిరి. (ఇంచుక నడచి) ఇందు నాభర్త కళేబర మెచ్చటనున్నదో యరయవలయును. (వెదకుచుండఁగాఁ గాలికొక శవము దగులును.) ఏమిదీ! (దీపమునఁ బరికించి దీపము నేలపైఁబెట్టి) హా! నాథా! ఎట్టి దుర్మ

రణము నందితివి? తుపాకిదెబ్బ నీగళమును దూసికొనిపోయెను గదా! సత్యాగ్రహ వ్రతమైనను నిన్ను గాపాడ లేక పోయెనే! అక్కటా! నీ వెట్టి ప్రదేశమున బడియుంటివి?

సీ॥ ఒరులకుఁ గీడును ♦ నొనరింపఁగాఁబోవు
పర యువతులపైన ♦ భ్రాంతి గొనవు
స్వప్నంబు నందైన ♦ సత్యంబు దప్పవు
న్యాయమార్గంబు నె ♦ న్నండు విడవు
పృథ్వీసురులసేవ ♦ విడనాడ నెంచవు
మిత్రమండలి కెప్డు ♦ మేలు గనెదు
సాంగత్య మేవేళ ♦ సజ్జనావళితోడ
నితరుల సంపద ♦ కీర్ష్యఁ జెంద

తే॥ గీ॥ వట్టి పావనమూర్తి వీ ♦ వకట నేడు
కంటకపరీత మైనట్టి ♦ కటికినేల
దీర్ఘ నిద్రను బోతివే ♦ ధీరిచరిత
వనజభవు వ్రాత కేమని ♦ వగచుదాన.

సంఘమరణము పెండ్లితో సమానమని యిట్లొనర్చితివా! అయ్యో! నన్ను విడనాడి పోవుటకు నీ చిత్తమెట్లు సమ్మతించినది? నీ మనోహరి నగు నన్ను విడిచిపోవుట నీకు ధర్మమా! నీకై కన్నుల నశ్రుబిందువులు ప్రవాహంబుగా బాఱునట్లు విలపించు నీ ప్రియురాలిని నాదరింప రావా! (ఇంచుక యూరకుండి "డయ్యరు" నుద్దేశించి) ఓ! డయ్యరు సేనానీ! పాంచాలురు నీ యెడల నేమి మహాపరాధము గావించి నారని యిట్టి ఘోర కృత్యమునకు బాల్పడితివి? ప్రతిమానవుడును దన ప్రాణములపైనే దనకెంత దీపియుండునో యితరులకుగూడ నట్లే యుండునను మాట నీ వెఱుంగక యుంటివా?

భ-పు—(తనలో) ఈ స్త్రీ యెవ్వరోకదా! ఏకాకియై యీ ప్రదేశమునకు వచ్చి విలపించుచున్నది. ఆ క్రిందపడియున్నది యొక మృతకళేబరమువలె గన్పట్టుచున్నది. పాప మీమె దిక్కులేనిది కాబోలు. సంగతి విచారించెదగాక!

రత్న—(భర్తృకళేబరమునుజూచి) నాథా! నీవులేని నాకీ జీవన మెందుకు?

భ-పు—(రత్నకుమారిని సమీపించి) తల్లీ! నీ వెవ్వరవు? ఈ రాత్రిసమయమున నిచ్చటి కరుదెంచి విలపించెద వేల! ఈ మృతకళేబర మెవ్వరిది?

రత్న—ఓ! పురుషాగ్రగణ్యా! నీ వెవ్వరవు! ఇచ్చటి కేలవచ్చితివి?

భర-పు—నేను భరత పుత్రుడను.

రత్న—ఏమీ! నీవు భరత పుత్రుడవా?

తే॥ గీ॥ భరతవర్ష మల్లరులచేఁ ♦ బ్రబలియుండ
నిద్రబోవుచు నుంటివా! ♦ నీవు వాని
నెల్ల మఱచి; యెచట నుండి ♦ యిట్లు నేడు
వచ్చినాఁడవు చెప్పుమీ ♦ భరతపుత్ర.

భర-పు—తల్లిగారి యాదేశమున నందందుగల విశేషముల నారయ వచ్చితిని. నీ శోకమునకు గారణమేమి?

రత్న—నా శోకమున కింతకన్న కారణమేమి కావలయును. ఈ మృతుడైన వాడు నా భర్త.

భర-పు—విధికృతంబున జరిగిన దానికి నీవిట్లు విచారించినందువలన ప్రయోజన మేమియున్నది?

రత్న—ప్రపంచ మంతయు విధికృతముననే నడచుచుండును? అయినను భర్తృశోకము భరింప శక్యము గానిది కదా!

మ॥ తనయుల్లేని కుటుంబమున్ ధరణిలో ♦
దైవంబు లేనట్టి యా

రును చంద్రుండును లేని రేయి రఘుఘీ ♦ రుజ్ మానసం
బందుఁ గొ
ల్వని జన్మంబును, భర్తృహీన యగు నా ♦
పద్మాక్షియున్, గంటె, స
జ్జన బృందంబులచేతఁ జూడఁ బడునే ♦
సత్యంబు వీరోత్తమా.

పతి లేని సతి బ్రతుకేటికి. దుర్భరంబైన వైధవ్యము నంది జీవించుట కన్న నీతని చరణ సన్నిధినిఁ బ్రాణములఁ బాయుట మంచి దని తలంచు చుంటిని.

భర- పు—నీ వెంతయు వెఱ్ఱిదానవు. చచ్చినవారితోడ బ్రతికి యున్న వా రెప్పుడును గాలము జెల్లకుండఁ జావరు.

మ॥ సరసీజేక్షణ నాదుమాట విను మా ♦
చంద్రార్క తారావనీ
శరధిస్థాయిగ నెవ్వ రైన మనఁగా ♦
శక్యంబె భూమండలిన్
మరణం బెప్పటికైన దేహికి స్థిరం ♦
బై యుండు దాసిన్ మదిన్
బరిశీలింపుచు ధైర్యముం గనుము భా ♦
వంబందు నిప్పట్టునన్

మృతుండైన నీభర్త మరల సంప్రాప్తింపడు. కాలమాసన్న మైనంత నే, ప్రతివారును మృత్యుముఖ గహ్వరమును బ్రవేశింప వలసినదే. అదియుం గాక,

మ॥ తనువుం బోయిన మీదటం మిగుల ఖే ♦
దం బందుచున్ గాటి దా
కనె నే తెంతురు జుట్టములు బ ♦
క్కా లెవ్వరున్ జీవితో
వెను వెంటన్ జనుదేర జాల రిట సా ♦ ధ్వీర
త్నమా యీ నుడిన్
మనమం దెంచుచు ధైర్యమున్ గనుచుఁ బో ♦
మ్మా నీవు నీ వీటికిన్.

ఈ రాత్రి సమయమున నీ విచ్చట నుండక గృహంబున కరిగి, తెల్ల వారిన పిమ్మట నీపతికి దహనాది కృత్యంబులు నావేరు యత్నంబు సేయుము. చింతింపక పొమ్ము.

రత్న—అయ్యో! ఈతని యకాలమరణమునకు నేను చింతింపక యె ట్లుందును?

భర- పు—ఏమీ! అకాల మరణమా!

రత్న—కాకున్న నీ విచార మేల!

తే॥ గీ॥ బాహు బలము దీపింపఁగా ♦ బవరమందు
బదుగురను జంపి తాఁగూడ ♦ బ్రాణములను
విడిచి యుండిన నీచింత ♦ బడను గాని
గారణము లేని మృతికి నే ♦ గందు వగపు.

అకారణముగ నీతని శరీర మన్యాయ ధవళ శతఘ్నికా ప్రయోగమునకు గతి యయ్యెను గదాయని నేను శోకించుచుంటిని.

భ-పు—నీభర్తృమృతికిఁ గారణము సవిస్తరముగ వినఁగోరెదను.

రత్న—పురుషవరేణ్యా! వినుము. ఈ సంవత్సరము మార్చి 18 తేదీన సామ్రాజ్య శాసన సభలో "రౌలతు" చట్టమను నొక శాసనము నిర్మింపబడినది. పంజాబురాష్ట్రమున హిందూ మహమ్మదీయ జాత్యైక్యత నెలకొల్పిన డాక్టరు సత్యపాలు కిచ్లూగార్లు రౌలతు శాసనాందోళనమునకుఁ గారణులని గవర్నమెంటువారు వారిని నెచ్చటనుపన్యాసము లీయఁగూడదని యాజ్ఞాపించినారు. ఆ మార్చి 30 తారీఖున నిచ్చట నొక గొప్పసభ జరిగినది. ఆ దినమున హరితాళ మతి శాంతియుతముగ జరిగినది. ఇందు కిచ్లూ సత్యపాల్ గార్ల కిచ్చిన యుత్తరువులు తీసివేయించ వలసినదనియు, రౌలత్తుచట్టము రద్దు పఱపించ వలయు ననియుఁ దీర్మానములు జరిగెను.

భ-పు—బాగున్నది! పాంచాలురు సత్యపాల్ కిచ్లూ గార్ల పైనున్న గౌరవము సూచించిరి. దేశోద్ధారణకు, గారణులు దేశనాయకులే కదా! హిందూ మహమ్మదీయ సమ్మేళనముండినఁ గాని భారతవర్షముద్ధరింపబడదు. ఈ నాయకు లిరువురును పాంచాలమున నిట్టి జాతీయసమ్మేళనము గావించి లోకవినుతికి పాత్రులైరి. తరువాత,

రత్న—ఆ ముప్పదియవ తారీఖున జరిగిన సభ పంజాబు రాష్ట్రపు గవర్నరు గారగు సర్ మైకేలు ఒడయరుగారికి కన్నులెఱ్ఱపడఁ జేసినది. వీరు కిచ్లూ సత్యపాలురపై 3 ఏప్రియల్ తేదీన నిర్బంధావాసము (ఇంటర్నమెంటు) ఆర్డరు పంపించిరి. పండిత కోటుమన్, పండిత దీనానాథ స్వామి, భవానంద మొదలయిన వారినిఁ గూడ నిటులనే స్వేచ్ఛారహితులఁ జేసిరి. "మా యుత్తరువులగు వఱకును" నమృతసర పట్టణపు సరిహద్దులలోనే యుండవలసినదనియు ఏసంగతులును, [illegible] నచ్చువేసి ప్రచురింపఁ గూడదనియు, ఏ బహిరంగసభను [illegible] పఱచఁగూడదనియు, నేసభకుఁ బోఁగూడదనియు, నోటి [illegible] గాని వ్రాతమూలకముగాఁగాని, యే బహిరంగ సభలో [illegible] ప్రసంగింపరాదనియు, 3 వ ఏప్రియల్ నాడు కిచ్లూ సత్యపాలు గార్లకిచ్చిన యుత్తరువులలో నున్నది.

భ-పు—ఆహా! ఈ రాజప్రతినిధియొక్క పరిపాలన!

మ॥ ధరణీభారము నిర్వహించునతఁడా ♦ తన్మక్షోణిలో నందఱన్
గరుణాయుక్త మనంబుతో నరయుచున్ ♦ గాపాడుటల్ మాని, ని
ష్కారుణ్యా రాజ్య మదాంధవృత్తిఁ బ్రజలన్ ♦ గారింపఁగాఁ జెల్లె. వ
క్కారుణ్యా జేసిన ధర్మహానియుఁ దిర ♦ స్కారంబుగాకుండునే.

రాజప్రతినిధి యనఁగా రాజుతరువాత రాజంతటివాడు. (ఇంచుక యూరకుండి) తరువాత, నేమి జరిగినది.

రత్న—ఈనెల (ఏప్రియల్) 6 తారీఖున భారతవర్షమునఁ బ్రతి పట్టణంబునను, రౌలతు శాసనము రద్దుపఱుపుడని దొరతనమువారికిఁ దెలియఁజేయ గాంధీ మహాత్ముని యాదేశము ననుసరించి, జనులెల్లరును సత్యాగ్రహ వ్రతదీక్షా పరులై హరితాళమును జరిపిరి. అట్లనే యీ అమృతసరంబునఁగూడ సత్యాగ్రహ వ్రతోత్సవము పూర్తిగ జరిగెను. సిక్కులు, మహమ్మదీయులు, హిందువులు, వారు వీరననేల సమస్తమైనవారును హరితాళముల గావించిరి. వీనినన్నిటిని ప్రజలు తమంతట దామే చేసిరిగాని, యొవరి ప్రోత్సాహమువలనను గాదు. ప్రజ లతి శాంతితో దీనిగావించిరి.

భ-పు—ఏ ముహూర్తమున గాంధీమహాత్ముడు సత్యాగ్రహమును స్థాపించెనోగాని యది భరతవర్షమంతటను బ్రాకినది. మున్ను దక్షిణాఫ్రికా యందు భారతీయుల యవస్థల నీ సత్యాగ్రహ వ్రతమూలమున తొలగించెను. తరువాత, తరువాత,

రత్న—ఇట్లారవ తేదీ బహు శాంతియుతముగ జరిగిపోయినది. 9 వ తేదీన శ్రీరామనవమి యుత్సవము. ఈ యుత్సవమున హిందూ ముసల్మానులలో బరస్పర సోదరభావమును ప్రబలజేయ వలయునని నాయకులు తలంచిరి. శ్రీరామనవమి హిందూమత సంబంధమైన పండుగయే యైనను, నిందు మహమ్మదీయులుగూడ జేరి యుత్సవమునకు మఱింత శోభదెచ్చిరి. హిందూ మహమ్మదీయులు గలిసి పెద్ద యుత్సవమొకటి బయలుదేరదీసిరి. కిచ్లూసత్యపాలురీ వైభవమును దమ నిర్బంధావాసములనుండి వీక్షించిరి. ఈ దినమున నచ్చట బ్రదర్శింపబడిన ప్రజాశక్తి, జాతీయైక్యత మిగుల వర్ణనాతీతమని చెప్పవచ్చును. ఈ యుత్సవము జూచినచో నెట్టివారికైనను నానందము దవితీరును; ఓడయరుగారు మాత్ర మాగ్రహావేశ పూరితులైరి. ఉత్సవ మతి శాంతముతోడనే నడచెను. ఏమైననేమి ప్రజాశాంతికి భంగము గలుగుటకై లాహోరులో నూతనమైన యుత్తరువు లాదినముననే దొరతనమువారు తయారు చేసిరి. 10 వ తేదీన కలెక్టరు గారు సత్యపాల్ కిచ్లూగార్లను తనయింటికిఁ బిలిపించి యాయుత్తరువులు వారిమీద జారీచేసి యాక్షణముననే వారినొక మోటారు బండిలోఁగూర్చుండఁజేసి యెక్కడికో పంపివేసిరి.

భ-పు—ఎంత యధర్మ కార్యముజేసిరి? ఎంతదారుణముగఁ బ్రవర్తించిరి. (కాలము నుద్దేశించి)

తే॥ గీ॥ దయయు, సత్యంబు, శౌచంబు ♦ ధరణి నడఁగె
ధర్మమునకేటఁ జూచిన ♦ దారిలేదు
ప్రబలిపోయె నధర్మంబు ♦ భరతవర్ష
మందు; గాలమా! యిందుకే ♦ మందునిన్ను.

రత్న—ఓ భరతకుమారా! కాలమేమి చేసినది. మనవారి తెలివి తక్కువయే యిందులకు గారణము. మొదటి నుండియు మన వారియొద్ద తెలివి యున్నచో దేశమున కిట్టి గతి సంభవించునా?

భ-పు—అమ్మా! నిజము బలికితివి. క్రమము తప్పకుండ తరువాత నేమి జరిగినదో చెప్పుము.

రత్న—సత్యపాల్ కిచ్లూగార్ల వార్త పట్టణమున వ్యాపించెను. వెంటనే ప్రజలు గుంపులుగా గూడి సత్యపాల్ కిచ్లూ గార్లను విడుదల చేయ వలసిన దని కలెక్టరు గారిని గోరుటకు వారి బంగళాకు బోవు చుండిరి. వీరు కొంత దూరము పోవునప్పటికి రైల్వే బండ్ల వంతెన యొద్ద కాపలా యుంచ బడిన "మిలిటరీ" సైన్యము వీరి నడ్డగించెను. ప్రజలు తాము కలెక్టరు బంగాళాకు బోవుటకు గారణము చెప్పి పోనిండని యడుగుచు బది యడుగులు ముందుకు వైచిరి. అంతట మిలిటరీ వారు వెంటనే ప్రజా సమూహముపై తుపాకులను గాల్చిరి. కొందఱు నిహతులైరి. కొందఱికి గాయములు తగిలినవి.

భ-పు—దీనితో ప్రజా సమూహము వెనుకకు మఱలి పోయినది కాబోలు!

రత్న—జనులెట్లు మఱలుదురు. ఇప్పుడు ప్రజలలో శాంతభావము వదలి పోయెను. చచ్చిపోయినవారినిఁ జూచినంతనే ప్రజలకు మఱింత రౌద్రము కలిగెను. ప్రజలనేక గుంపులుగాఁ జేరిరి. ఈ సమయమునఁ బ్రజలలో గొందఱివద్ద కఱ్ఱలున్నవఁట. వీరందరును ముందునకు సాగిరి. కొందఱు పెద్దమనుష్యులీ యల్లరినాపుటకుఁ బ్రయత్నించిరి. కొంతవరకు బ్రజలను వెనుకకు మరల్చిరి కాని బండ్ల వంతెన వద్దనున్న వారు మాత్రము కదల లేదు. మిలిటరీ వారు వీరిపై తిరిగి తుపాకులు బ్రయోగించిరి. ఇక్కడ నిరువదిమంది హతులైరి. పెక్కుండ్రకు గాయములు తగిలినవి. మొదట నిక్కడ నల్లరి యడగునట్లే కానిపించినది గాని ప్రజలలో నెవరో కొందరు మిలిటరీ వారిమీద రాళ్ళను కఱ్ఱలను విసరుటచే వారు [illegible] తుపాకులను గాల్చిరి. గాయములుతగిలినవారిని వైద్య శాలకు గొనిపోవు చప్పుడు శ్రీ వైద్యశాలలో నున్న "ఈసడన్" అను దొరసాని హిందువులకు దగిన శాస్తి యైనదనినవ్వినదఁట.

భర-పు—హైందవులు బ్రతుకిట్లుండెనుగా ! తరువాత,

రత్న—ఉద్రేక పూరితు లయిన జనులా మాటవిని యామెకై జనానా ఆసుపత్రి లోనికి బోయిరి. కాని యామెకు భగవంతుడు డాయుర్దాయ మిచ్చి యుండుటచే "బెంజమిన్" అను నామె యామెను దాచివేసినది. అక్కడ నుంచి కోపావేశులై యొడలు దెలియక కొందఱు జనులు "నేషనల్ బ్యాంకి" మీదపడి మేనేజరగు "స్టీవార్డు" దొరను, స్కాట్టను అనువానిని జంపివేసిరి. రైలు స్టేషను వద్దనుండు సామాను కొట్టులోఁ గొందఱు ప్రవేశించి "రాబిన్సను" అను గార్డును చంపివేసిరి. కొంతమంది ప్రజలు "అలయన్సు బ్యాంకు మీదఁబడిరి. దాని మేనేజరు తుపాకిని వీరిమీద గాల్చెను. ప్రజలు లక్ష్యముసేయక యాతనిపైబడి మరణమొందించిరి. సర్జంటు రౌలందుఅను దొరను "రీగో" వంతెనవద్ద పరలోక ప్రాప్తునిఁజేసిరి. టౌన్‌హాలు, పోస్టాఫీసు, మిషన్‌హాలు వీనిని దగులఁబెట్టిరి. చార్టర్డు బ్యాంకినిగూడ గాల్చి వేయఁదలంచిరి. కాని సాగలేదు. మిస్ షర్ ఉడ్" అను పేరుగల ఆడపిల్లల బడి కుపాధ్యాయిని యైన యొక దొరసాని సైకిల్ మీదఁ బోవుచుండఁగా నెవరో పట్టుకొని క్రూరముగఁ గొట్టిరి. కాని యొక హైందవుని చేతనే యామె రక్షింపఁబడెను. ఈ గంద్రగోళమంతయు సాయంత్రము 5 ఘంటల కడఁగిపోయెను.

భ-పు—అహా! ఎంత అల్లరి జరిగినది. కిచ్లూ సత్యపాలుర విషయమై కలెక్టరు గారితో మనవిజేసికొన బోవు ప్రజలను వారించి, వారిపై దుపాకులు గాల్చుట వలననే కదా యీ యల్లరికిని, ప్రజల యుద్రేకమునకును, గారణ మైనది. అపాయమను మాట నావంతయు నెఱుంగ నప్పుడు ముందుగా, బ్రజలపై నారేల తుపాకుల గాల్చిరో తెలియకున్నది. అకారణముగ వారే ప్రజలను పొడిచి రేపిరికదా ! అక్కటా! ఆంగిలేయులకు భారతీయుని ప్రాణమన్న నంత చాల చులకనగ నున్నది కాబోలు. (యించుక యూరకుండి) సాధ్వీమణీ! తరువాత నేమి జరిగినది?

రత్న—11 వ తేదీన చనిపోయిన వారికి దహన క్రియలు సేయుటకుఁ బ్రజలు యత్నించిరి. శవ వాహకులుగాక దానివెంట నలువురు మనుష్యులకంటె నెక్కువమంది యుండగూడదని మిలిటరీవారుత్తర్వులు జారీచేసిరిగాని ప్రజలు శవములను నుత్సవములతో శ్మశాన వాటికకుఁ గొని పోదుమని చెప్పిరి, ఎట్టకేల కధికారులందుకు సమ్మతించిరి. అంతట నాపనియంతయు నాదినము మధ్యాహ్నము 2 గంటలకు బూర్తి యైనది. ఈ లోపుగ "జనరల్ డయ్యరు లాహోరు నుండి వచ్చి "రాంబాగ్" లో విడిసి యుండెను. ఈతడే పంజాబు దురంతరములకు గథా నాయకుడు. ఈతడు పట్టణములో నడుగుపెట్టిన యంతనే 12 అరెస్టులు చేసినాడు. 12 వ తేదీన హంసరాజను నాతఁడు "దాబ్ ఖాటీ ఖాన్" అనునొకచోట సభజేసెను. ఈసభయందాతడు 13వ తారీఖున జలియన్ వాలాబాగ్ తోటలో నొక గొప్పసభ జరుగు ననియు, దానికి "లాలాకన్ హ్యాలాలు" గారాధిపత్యము వహింతురనియు చెప్పెనట. 13 వ తేదీ యుదయమున జనరలు డయ్యరు గారు పరివార సహితుడై నగరమును బ్రవేశించి, "పట్టణమునకు వెలుపలగాని, బయటగాని యెప్పుడును. నే విధమయిన యూరేగింపులును జరుగగూడ దనియు, నావిధమగు నెట్టి యూరేగింపులు జరిగినను, నలుగురు గుమి గూడి యున్నను దీనిని న్యాయవిరుద్ధమగు సమూహముగనే భావింతుమనియు, నవసరమైన యెడల దుపాకి గుండ్లతో జెదరి గొట్టి వేయుదుమనియు దెలియ జేయు నొక ప్రకటన నొక మనుష్యునిచే నందందు జదివించెను. ఈ డయ్యరీ ప్రకటనను గావింపకే పూర్వమే యొక కుఱ్ఱవాడు పట్టణపు వీథులవెంట నొక డబ్బాను వాయించుచు, "నేటిదినము సాయంత్రము నాలుగు గంటలకు జలియన్ వాలాబాగ్ "తోటలో" లాలాకన్‌హ్యాలాల్ గారి" యధ్యక్షతక్రింద నొక గొప్ప సభ జరుగును గావున నందరును రం" డని కేకలు వేసెను. నాటిదినము వైశాఖి పండుగ. అనేక వేలజను లితర గ్రామముల నుండి అమృతసర మునకు వచ్చిరి. "జలియన్ వాలాబాగు"నందు సభ జరుగునని

"జనరలు డయ్యరునకు" దెలిసి, సాయంకాలము 4 ఘంటలకు, నాతఁడు కొంతమంది సిపాయిలతోడను, రెండు ఫిరంగీ బండ్లతోడను నాస్థలము జేరెనట. ఆసభకు 20,000 మందిజనులు వచ్చియుండిరట, హంసరాజను నతఁడు సభావేదికపై నెక్కి యేదియో యుపన్యసించుచుండెనట. పాంచాలురపై బగ దీర్చుకొనుట కిదియే సమయమని యెంచ్చుటకు నన్ని ప్రయత్నములు జేసికొని వచ్చియున్న "జనరలు డయ్యరు, సిపాయిలకు దుపాకుల గాల్చుట కాజ్ఞ యిచ్చెనట. వెంటనే నారాతని యాజ్ఞ బాలించిరి. డయ్యరు గారు కల్పించిన యీ యగ్నిహోత్రమున రెండువేలమంది జనులయినను నాహుతిరైయుండురని చెప్పుకొనుచున్నారు. (ఇంచుక యూరకుండి) భరతపుత్రా! నేటిదినము సంవత్సరాది పండుగ యిట్లు జరిగినది. ఆ సభ కరిగిన మన్మాధుడిట్లు మడసినాడు. నాయినా! ఇదియే జలియన్ వాలాబాగు. ఇదిగో! చీకటిగా నుండుటచే నీకు గనిపించుట లేదు. ఇదియంతయు, మృతకళేబరములతోడను, రక్తప్రవాహము తోడను నిండియున్నది. పాంచాల రాష్ట్రపు యవస్థ వింటివా!

భ॰పు—అక్కటా! పాంచాలభూమి కెట్టి యవస్థ సంభవించినది. ఒక్క పాంచాలమునకే యననేల! భారతవర్షమంతయు నిట్టి స్థితినే యందియున్నది. ఎక్కడఁ జూచినను బరిపాలనమున ధర్మ మడుగంటి యున్నదని పలుకవాలేకదా!

సీ॥ భరతభూమి సుఖంబు ♦ బడయుటఁ జూడర
టంచుఁ జిత్తంబున ♦ నెంచినావ
అభిమాన ధనమును ♦ ద్యజియించి ప్రజసేయు
దుర్మార్గములజూచి ♦ తొలగినావ.
బ్రాహ్మణా బ్రాహ్మణా ♦ భావ కక్షలఁజూచి
యాగ్రహంబును గాంచి ♦ యరిగినావ

పరసేవలను జేసి ♦ బ్రతుకు చుండిరి వీర
లంచును రోతగా ♦ నెంచినావ

తే॥ గీ॥ యెందుఁజూచినఁ గాన్పింప ♦ వేల! యెచట
నుంటి; వే కడగండ్లను ♦ నొందుచుండి
ధర్మదేవతా! మదిని నిన్ ♦ దలఁచినంత
జాలి పుట్టుచునున్నది ♦ స్వాంతమందు.

ఉ॥ ధారుణినేలు నాయకుల ♦ ధర్మపథంబున నుండ్రి, పాలనా
చారము దెల్పు మాంత్రికులు ♦ సద్గుణ హీనులు, గాగనొప్పె;రీ
తీరున రాజ్య పాలనము ♦ తెంపు వహించెను నందుచేత నీ
భారత భూమి యిట్టి దుర ♦ వస్థలజెందె నికేమిచెప్పుదున్.

కావున్నచోఁ బాంచాలమున కీగతి సంభవించుట యేమి? ఈ పాంచాలుర సంగతినిఁ గూర్చి దొర తనము వారెఱుఁగరా! మొన్న జర్మను సంగ్రామమున బాంచాల దేశము ప్రభుత్వముువారి కెంత సైన్య సహాయమును జేసినది. ఎంత ధన సహాయ మొసంగినది. నిశ్చయముగా ప్రభుత్వము వారి విజయమునకు భారతీయులే కారణము. ఇది యంతయు వారు మరచి వర్తించిరి కదా! కానిమ్ము! ధర్మమే జయము నిచ్చునను పెద్దల వాక్యము తప్పదు. (ఇంచుక యూరకుండి) ఇంతవఱకును నీ రాత్రి సమయమున, భర్త్రు మరణంబున విలపించు నీకు శ్రమ యిచ్చితిని. ఇంక నీవు గృహమున కరిగి నీ బంధు జనులఁ గూడి, యీతనిఁ బరలోక క్రియలం గూర్చి విచారింపుము.

రత్న—భరత పుత్రా! మృతుండైన నా ప్రాణేశ్వరునిఁ బాసి గృహంబున కెట్లు పోవుదును. ఈతని యకాల మరణ కారణము నా హృదయమును దహించి వేయుచున్నది. శోకముతోఁ గ్రోధముతో గాదగినది. లేదు.

ఉ॥ ఏను మహాపతివ్రతన ♦ యేని సుధర్మము నెంతునేని; నా
మానసమందుఁ బ్రాణధవు ♦ మానక కొల్చెడి దాననేని; స
న్మాన్యుల ధర్మలక్ష్యములొ ♦ సర్చెదనేని స్వరాజ్యవైభవా,
ధీనముగాఁగ నీభరత ♦ దేశము సంపదలొందుఁ గావుతన్.

(నిష్క్రమించును)

భ-పు—(తనలో) రౌలతు శాసనాందోళన మెంతకు దెచ్చినది. ఇంతకు మున్నె టర్కీ విషయమై చేసిన మాయకు మహమ్మదీయులు మండి పడుచున్నారు. దానికి దోడిది సంప్రాప్తించినది. కానిమ్ము. ఒకదాని కొకటి బలమైన గాని కార్యములు చక్కబడవు. నేను రెండు మూడు దినముల వఱకును యీ ప్రాంతమునందే యుండి యింకను విశేషముల నారసిపోయి తల్లిగారికి వినిపించెద గాక!

(నిష్క్రమించును)

ఇది ప్రథమాంకము

స్వరాజ్యధ్వజము.

ద్వితీయాంకము.

రంగము:—అరణ్యసీమలో - కొండగుహ:—ప్రవేశము.
విచారముతో భరతమాత - భరతపుత్రుడు ప్రవేశము

భ-మా—పంజాబు దురంతము లేమని వగతునోయి! దొరతనమువారి యాజ్ఞ లిట్టి యధర్మపథమునందు వర్తించుచున్న వేమి చెపుమా!

సీ॥ ఏ నేరమును జేసి ♦ యెఱుఁగని వారిని
దీవ్రతన్ బరుగు లె ♦ త్తించినారె
పైనున్న వలువలు ♦ పాఱవేయఁగఁ జేసి
కొఱడాల దెబ్బలు ♦ గుఱిపినారె
నిరతంబు సుఖములన్ ♦ నెగడు నిర్దోషుల
వేడి యెండను నిలఁ ♦ బెట్టినారె
ఇనరస్మి యనుమాట ♦ నెఱుగని సతులను
జేయరాని పనులఁ ♦ జేసినారె

తే॥ గీ॥ తండ్రి! యెంత దుస్థితిఁగల్గె ♦ ధరణియందు
నాదు పాంచాలు రకును; వి ♦ న్న హృదయంబు
చీలికలు గాక యున్నది ♦ చెప్పు మయ్య
యెట్లు జీవింతు భరియించి ♦ యిట్టి వగపు.

ఈ వర్షమున మునెన్నడును లేని దురంతములు పుట్టుచున్నవే.

భ-పు—తల్లీ! ఈ పాంచాల దురంతములఁ గొన్ని నే నదృశ్య రూపమున నుండి చూచితిని. వానినిఁ జూడలేక నా గుండెలు చెక్కలై పోయినవి. అనవసరముగ "మార్షలు" లా పురంబున బ్రవేశపెట్టి నిర్దోషులగు జనులను ననేక తెఱంగుల హింసించిరి.

సీ॥ సిగ్గులేదె యటంచుఁ ♦ జేరి, సజ్జనులను
మోటు లాఠీలచే ♦ మోదినారు
నడక యను మాట నె ♦ న్నడు నెఱుంగని వారి
పెక్కు క్రోసులు ♦ నడిపించినారు
ఇవి మోయుఁడీ యంచు ♦ నింతైనఁ దలపక
వెట్టి మూటల నెత్తి ♦ బెట్టినారు
కడు గౌరవంబునఁ ♦ గ్రాలు వారలను "పో
లీసు" భటులుగను ♦ జేసినారు

తే॥ గీ॥ చేయవలసిన క్రియలను ♦ జేసినారు
కరుణ యను మాట సున్నైన ♦ గానకుండ
నాఁడు పాంచాల దేశంబు ♦ న; దొర లకట
నా యనుజ్ఞల నేమందు న ♦ న్యాయ బుద్ధి.

ఇంక ననేకమైన బాధలు గలిగించిరి. పొట్టమీద పడుకొని ప్రాకిపోవునట్లు చేయించిరి. ప్రజ లందఱును ప్రతి యాంగిలేయునకును సలాము చేయున ట్లుత్తర్వు జేసిరి. తల్లీ! ఎన్నని చెప్పగలను?

భ-మా—అక్కటా! పాంచాలు రెట్టి కష్టముల ననుభవించిరి? ఆనాఁడు "జలియనువాలాబాగు" నందు వారిపై గుండ్ల వర్షము గురిసినప్పుడెంతగా వారు చింతించిరో కదా!

భ-పు—అమ్మా! ఏమని చెప్పుదును?

"సీ॥ జేగి ఆరే మేర" ♦ బీబీ కహాఁగయా
యని తమ భార్యల ♦ నరయు వారు
"అల్లా కైసికరరే ♦ యనుచుఁ గన్పించని
కొమరులకై లోనఁ ♦ గుందు వారు
"ఫుర్ బడా కాంకరే ♦ వో అచ్ఛానె" యంచు
మించి దొరలను దూ ♦ షించు వారు
"మేర భాయీకు" ఫుర్ ♦ మారేరె బందూక్సె
యంచును నెంతో చిం ♦ తించు వారు

తే॥ గీ॥ గలిగి యాందోళనమునకు ♦ నిలయ మగుచు
నాఁడు పంజాబు దనరు టర్ ♦ గాంచి యుండి
చింతఁ బొందితి నెంతైన ♦ స్వాంత మందు
దెరువు నూహింప వలెఁగాదె ♦ దీని కింక.

పాంచాలుర స్థితి యిట్లున్నది. వేయేల భారతవర్షమంతయు గూడ దీనస్థితి యందే యున్నది. రాజ్య పరిపాలనా పద్ధతులు మార్పుఁజెందినఁ గాని దేశమునకు సుఖము గలుగదు.

భ-మా—వత్సా! ఇంకను నీ దేశము బాగుపడున్నా! అయ్యో! ఈ దేశమున కెట్టిగతి సంభవించినది. పూర్వమెట్టి మహాదశఁ బొంది యుండెనుని భరతఖండ సామ్రాజ్య సింహపీఠి యెట్టి స్థితియం దున్నది?

సీ॥ ధర్మరాజుం డాది భూ ♦ వరులు ప్రతిష్ఠింపఁ;
జిరకీర్తి నందిన ♦ సింహపీఠి
అల తురుష్క నృపతు ♦ లాజు లొనర్చి శా
సింపఁగాఁ జాలిన ♦ సింహపీఠి

పరదేశ రాజులు ♦ వదలని కోర్కెనా
సించి ఖండించిన ఘనత ♦ సింహపీఠి
అఖిల భారత భూమి ♦ కాభరణ మగుచు
శ్రీలచే నొప్పిన ♦ సింహపీఠి

తే॥ గీ॥ అఖిల లోకము లందున ♦ నలరు చున్న
సింహపీఠుల మించిన ♦ సింహపీఠి
అట్టి భరతవర్షపు పీఠ ♦ మకట నేఁడు
దీనగతి నంది యుండెఁ గా ♦ దే! కుమార.

వత్సా! నాపూర్వస్థితిఁ దలఁచు కొన్న నా కెంతయో చింత కలుగు చున్నది.

సీ॥ ధర్మాభిరతుఁడు స్వా, ♦ ర్థత్యాగియును నైన
ధర్మాధవుండు దు ♦ ష్యంతునాఁడు
సకల రాజకిరీట ♦ సన్మణీదీప
సీ, రాజితుండగు ధర్మ ♦ రాజునాఁడు
హిందూ జనానంద ♦ మందారు డౌఘను
రాజల్లిన పృథివి ♦ రాజు నాఁడు
జాతీయ బావంబు ♦ జాటగాఁ జాలిన
సరసు డక్బరు షాద్షు ♦ షాహి నాఁడు

తే॥ గీ॥ వత్స! యెట్టి భోగము లంది ♦ వరలి నానో
దైవమే యెఱుంగును వాని ♦ దత్యముగను
కాల గతిచేత నే డవి ♦ కానఁ బడవు
కటాకటా యే మని వగతు ♦ గర్మమునకు.

భ-పు—అమ్మా!

తే॥ గీ॥ కాలమొక్క విధంబునఁ ♦ గడువఁ గలదె
చీకటులు పోయి వెన్నెలల్ ♦ చెలఁగురీతి
గష్టములఁ బాసి సౌఖ్యముల్ ♦ గాంచ గలము
వంత యేటికి దీనికి ♦ స్వాంతమందు.

భ-మా—ఎన్నటి కైనను నేను సౌఖ్యములఁ గాంతునా! నా సంతానమంతయు దాస్య బంధనంబులఁ గట్టువడి యున్నదే! రాజ్య పరిపాలనా పద్ధతి యందధర్మము బొడ గట్టుచున్నది. కావున సవరించు కొండని చెప్పినచో ప్రభుత్వమున కాగ్రహము వచ్చు చున్నది. రాణిగారు చేసిన వాగ్దానము ననుసరించి, మాకు స్వరాజ్య మనుగ్రహింపుఁడని కోరినచో శిక్షలు గలుగు చున్నవి. ఎవరైనను నలువురు స్నేహితులు జేరి వీధిలో మాట్లాడు కొనుట దోషముగాఁ బరిగణింపఁ బడుచుండెను. ఎచ్చటనైనను బహిరంగముగ సభలు జేసి, మన స్థితి గతులు వెలిబుచ్చు కొందమన్నచో వానికిఁ నాటంకము వాటిల్లు చుండెను. వత్సా! ఇట్లు స్వేచ్ఛారహితులై యున్న నీ సోదరులను జూచిన నా కెంతయు దుఃఖము కలుగుచున్నది.

భ-పు—అమ్మా! రాణిగారి వాగ్దాన మని చెప్పితివి? ప్రభుత్వము వారెప్పుడైనను భరతవర్షమునకు స్వరాజ్య మిచ్చెద మని చెప్పి యుండిరా?

భ-మా—మునుపు కంపెనీవారి పరిపాలనమున నున్న మన దేశ పరిపాలనము విక్టోరియారాణీగారు తమ స్వాధీనము జేసి కొనినప్పుడామె మనతో "నాదేశముతో సమముగా మీ దేశమును గూడ బాలింతు ననియు, తెల్లవారు నల్లవారను భేదబుద్ధిని బూనననియు, మీ క్షేమలాభముల కొఱకే మిమ్ముల నేలుదు ననియు, మీ యభివృద్ధి నే నిరంతరమును గోరుచుందు ననియు, మొదలగు ననేకమైన సంగ

తులను జెప్పెను. చెప్పుటయే గాదు. అట్లు చేయుదు నని యొక పత్రము మీద గూడ వ్రాసెను. ఈ వాగ్దా నానంతరమున నామె 43వత్సరములు రాజ్యపరిపాలనము జేసెను. ఆమె తరువాత సప్తమ యెడ్వర్డుగారు దయచేసి, తల్లిగారు చెప్పిన ప్రకారమే చేయుదునని చెప్పుచు వచ్చి తొమ్మిది సంవత్సరములు కాలము గడపినారు. తరువాత ప్రస్తుత పాలకుడగు జార్జిచక్రవర్తిగారు వచ్చినారు. వీరును నదే మార్గముగు జెప్పిరి, కాని క్రియ మాత్రము జరుగుట లేదు. ఎప్పు డడిగితే అప్పుడు "ఇదిగో! అదిగో ! అని కాలము గడుపు చున్నారు. మనకు స్వరాజ్యము వచ్చున దెప్పటికో. తెలియకున్నది. "అర్థము ప్రాణము నాచార్యుల స్వాధీన" మన్నట్లు మన సర్వస్వమును నాంగిలేయుల వశమై యున్నది. ఇంతకుమున్ను దేశమున నున్న జాతీయ పరిశ్రమలు, విద్యలు, కళలు, సమస్తమును నశించినవి. కుమారా ! ఈ దేశము రత్నగర్భయని పేరందినను దారిద్ర్య దేవతకు నిలయమై యున్నది. చతుస్సముద్ర ముద్రిత మహీవలయమై యుండినను నుప్పునకు గూడ గఱవైనది. వలసినంత ప్రత్తికి నిలయమై యున్నను కట్టు గుడ్డకుఁ బరదేశము నాశ్రయింపవలసి వచ్చినది. అయ్యయ్యో ! ఢక్కా-మసిలునుల నేత కంటికి గానబడకుండఁ బోయెను కదా ! సకలమును దొరతనము వారి వశముఁజేసి వారి దాస్యబంధనములఁ గట్టుబడియున్న నా సంతాన మెట్లింక సౌఖ్యములఁ గాంచునో కదా ! (విచారించును)

భర-పు-అమ్మా ! విచారించి నందువలనఁ బ్రయోజన మేమియున్నది ? ఇందుకుఁ దగిన యత్నము సలుప వలయును గదా ?

భర-మా-ఏమియత్నము ! నీ సోదరులు సర్వవిధముల గృశించు చున్నారు.

సీ॥ ఏవృత్తిచేనైన ♦ నిల్లు గడుపు కొంద
మన్నను దానికిఁ ♦ బన్నుఁగలిగె
ఉదరపోషణముకై ♦ యుద్యోగ మొనరింతు
మన్నను దానికిఁ ♦ బన్నుఁ గలిగె

భూమిని దున్నుక ♦ పుడమిపై జీవింత
మన్నను దానికిఁ ♦ బన్నుగలిగె
తనయింటిలో నొరుల్ ♦ దనరంగఁ జేయుదఁ
మన్నను దానికిఁ ♦ బన్నుగలిగె

తే॥ గీ॥ యిల్లునకుఁ బన్నుఁ మఱియునుఁ ♦ జిల్లరఁగ దు
కాణ ముండినఁబన్ను; ప ♦ ల్కంగరాదు
గాని, యింకపైఁ బురుషుండు ♦ తనదుకాంత
గవయుటకుఁ గూడ నాపన్ను ♦ కలుగునేమొ.

భర-పు-తల్లీ ! పన్నులు లేనిదే రాజ్యాంగము నడవదు. కాని మనవల్లన వారు తీసికొనుచున్న పన్నులు క్రమమైన పద్ధతిని వారు ఖర్చుపెట్టుటలేదు. ఆకారణము చేతనే యీ ప్రదేశము మిగుల నీరసస్థితి నంది యున్నది. ఆహా ! (విచారముతో.)

మ॥ ఇంది దుష్యంత దిలీపపాలితమునై♦యింపొందు భూచక్రమా
యిది ధర్మంబుల కెల్ల నాలయమునై ♦ యేపార్థు వర్షంబ యి
య్యది వీరోత్తములుండు నట్టి స్థలమా♦హా! దీని కేమొందు, నె
మ్మది నూహింపఁగ నెట్టి దీనగతి సం♦ప్రాప్తించె నీభూమికిన్.

పరిభుత్వమువారు మనదేశమునకు స్వాతంత్ర్య మొసంగక పోవుటచే మనము దరిద్రుల మైతిమి.

సీ॥ విశ్వవిఖ్యాతమౌ ♦ వెలలేని కళలెల్ల
గటకటా గంగలోఁ ♦ గలసిపోయె
యింటింట నుండెడి ♦ యింపైన వృత్తులు
గానరాకుండఁగాఁ ♦ గాలిపోయె

మాతృభాషాసేవ ♦ మఱచి పరుల దేశ
భాషను వేడ్కనే ♦ ర్వంగనాయె
భరతవర్షపు మేటి ♦ భాగ్యమంతయు నేఁడు
భావించిచూడ స్వ ♦ ప్న సుఖమాయె

తే॥ గీ॥ మనలఁ బాలించువారికి ♦ మాటిపోయెఁ
జిత్తవృత్తులు దీనికిఁ ♦ జిత్తమందు
వెఱవు నేమైన నూహించి ♦ వేగసంత
సంబు గల్గించవలె నీకు ♦ జనని ! వినుము.

భ-మా-ఇంతకును మీ యుశక్తియే నా సంతాపమునకుఁ గారణము. కాకున్నచో నేనిట్లుందునా?

సీ॥ అన్యదేశమువార ♦ లరుదెంచి నన్నుఁ బట్టి
యీరీతిసేయ నీ ♦ విట్లు గనుచు
నూరకయుండుట ♦ యెప్పనే మీదు స్వా
తంత్ర్యనాశంబును ♦ దలఁపవేల
వివిధభూషణముల ♦ వెలసి యుండిన నన్ను
భూషణహీనగాఁ ♦ బుడమియందు
జేయఁ జగునె నీకుఁ ♦ జిత్తమం దిక నైన
మాతృభక్తినిఁ బూని ♦ మఱువకుండే

తే॥ గీ॥ నాకు దొల్లింటి భాగ్యంబు ♦ ప్రాకటముగఁ
గూర్ప యత్నంబు సలుపుమీ ♦ కోర్కెతోడ
గష్టమొందినఁ గాని సౌ ♦ ఖ్యంబు గలుగ
దనుచు నచియించు మాటను ♦ వినవెతనయ.

నేనిట్లు దుర్దశను బొందియుండఁగా, నీవు కనుమూసి యుండుట తగునా? నీ సోదరులందఱును నింతవఱకును నాంగ్లవ్యామోహమునఁ జిక్కి నిద్రను మునింగియున్నారు. వారిని మేల్కొలిపి నాకు సంతోషము గూర్పుము. ఇది నీకు విధియైయున్నది. లెమ్ము. ధైర్యచిత్తుఁడవుగమ్ము. సోదరులతోఁగలిసి కార్యదీక్షను బూనుము. నీసోదరులతోఁగూడ పరదేశవాసుల దాస్యమునుండి విముక్తుఁడవై నాకుసుఖంబు గూర్పుము.

భ-పు—అమ్మా! నీసుతులు ప్రతివిషయమునందున సంపూర్ణ ప్రజ్ఞావంతులయ్యును వారి ప్రజ్ఞలన్నియునుఁ గాలగర్భమునఁబడి మాయమైపోయినవి. పాశ్చాత్యులచేఁ బ్రయోగింపఁబడిన సమ్మోహనాస్త్రమునఁ గట్టుబడిపోయిరి; కాని యిప్పుడు గాంధియొనర్చిన ప్రబోధచే మేల్కొనిరి. ఇంక నిన్ను దొల్లింటి మహోన్నతపదవి నధిష్ఠింపఁ జేయుటకు బ్రయత్నములు జేయుదురు. లోకజననీ! నీకుమారుల యందున్న శౌర్యము, సత్యము, ధర్మవర్తనము, పురుషార్థము, గౌరవబుద్ధి, స్వార్థత్యాగము, ధైర్యసాహసములు, విజ్ఞానము మొదలగునవి మఱియేదేశము వారి యందునను లేవు. అమ్మా! నీవు భారతీయుల విషయమై సంశయింపఁ బనిలేదు. పరశురాముని శౌర్యమును గూర్చి దశదిశలును జాటుచున్నవి. భారత రణంబున మ్రోగింపఁ బడిన రణదుందుభుల ధ్వని యింకను వినిపించుచునే యున్నది. నిజ దేశ సంరక్షణార్థమై రసపుత్రులు పగఱపైఁ జూపిన పరాక్రమింకను మఱువఁ బడలేదు. ప్రతాపరుద్రుని పరిపాలనమును గూర్చి జ్ఞాపక మున్నది. పల్నాటి వీరుల యుద్ధమును గూర్చిన పదము సకల భారత జనప్రబోధము గావించుచున్నది. నీసంతతి యొక్క బాహునాడువుల యందు దార్యరక్తము ప్రవహించుచున్నది. వీ రెట్టి కార్యమునకైనను వెనుదీయరు. ఇంతవఱకును హూణజన మాయాతిమిరము నాసోదరుల కన్నులను గప్పివేసినది. ఇప్పుడు వీ రందఱును గన్నులను దెఱచినారు. వీరియాత్మలందు నవశక్తి యుదయించినది. దౌర్జన్య రహితమగు శాంతిమార్గమున వీరు నీకు సుఖములఁ గూర్తురు.

భ-మా—కానిమ్ము. ఏది యెట్లయినను నీవాక్యములు మాత్రము నాకు సంతసము గొల్పుచున్నవి. కాని నీవు మాత్ర మిప్పట్టున నొక పని, జేయవలసి యున్నది.

భ-పు—జననీ! ఆజ్ఞకు బద్ధుఁడను.

భ-మా—పుట్టి బుద్ధి యెరింగిన నాటనుండియు, దేశము నుద్ధరించుటయందే కృషిఁ జేయుచు, లోకముచే నవతారపురుషుఁడని యెన్నఁబడు బాల గంగాధర తిలకు నెఱుంగుదువుకదా. ఆతఁ డెప్పుడును నాకు హితము గూర్చుటకే యోచించుచుండును. నీవిప్పు డాతనికి కడకేగి, నేఁజెప్పెడి వాక్యము లాతనికి వినిపించి యాతఁ డెట్లు చెప్పిన నట్లు ప్రవర్తించుము. వేయేల! నీవు నన్ను వీరమాతగఁ జేయవలయును? కుమారా! జ్ఞాపక మున్నదా! నన్ను వీరమాతగఁ జేయవలయును! ఈమాటమాత్రము మఱచిపోవకుము. రమ్ము. తిలకుతోఁ జెప్పెడిమాటలఁ జెప్పెదను.

(ఇరువురును నిష్క్రమించు చున్నారు)

రంగము:— (బొంబాయినగరమున రాజవీధి-ప్రవేశము:— భరతపుత్రుడు)

భ-పు—(తనలో) నే ననవసరముగాఁ బునహాపట్టణమున కరిగితినిగాని యా లోకమాన్యుఁడీ బొంబాయినగరమునందే యున్నవాఁడట. ఈతఁడు తన బంధువులతోఁగూడ నీపురంబున సరదారు గృహమున విడిసి యున్నవాడట; కాని యాతని శరీరమున నేదియో వ్యాధి ప్రవేశించినదనియు, నందుచేఁ నస్వస్థుఁడై యుండెననియు వినియుంటిని. నేను బయలుదేరిన గడియలు మంచివికావు. *అయినను నింత దూరమువచ్చి లోకమాన్యుని దర్శింపకుండుట మంచిదికాదు. కావున నాతని దర్శించి యమ్మగారి సందేశము వచియించెదఁగాక.

(నిష్క్రమించును).

శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయము
సుల్తాన్‌బజార్, హైదరాబాద్. 1.

రంగము:— (సర్దారుగృహములో - తిలకు - భరతపుత్రుడు ప్రవేశించు చున్నారు.)

భ-పు—లోకమాన్యా! స్వదేశోద్యమము, విదేశవస్తు బహిష్కారము, జాతీయవిద్య, స్వరాజ్యాందోళనము మొదలగు విషయములలో నీవు చేసిన కృషి యింతింతయని చెప్పవలవి కాదు. నీ వెల్లప్పుడును రాజ్యాంగవిధానమందలి లోపముల నతినిర్భయముగ విమర్శించుచుండెడి వాఁడవు. దేశహితార్థమై యనేకకష్టములఁ బడుచుంటివి. అట్టిచోఁ బంజాబు దురంతములను గూర్చివినియు, నిట్లు శాంతి వహించి యూరకుండుటకుఁ గారణమేమో యూహింపఁ జాలక యున్నాను.

తిల—భరతపుత్రా!

తే॥ గీ॥ భవ్య పాంచాల దేశంబు ♦ పడినపాట్లు
వింటి; నెంతేని దుఃఖంబుఁ ♦ గంటి నాత్మ
కాని, యందులకు బ్రతివి ♦ ధాన మేమి
సేయఁజాలక పోతిని ♦ క్షితితలమున.

For REFERENCE ONLY

నేను బుద్ధెరింగిన తరువాత, భరతవర్షమున నిట్టి దురంత మెప్పుడును * జరిగియుండలేదు. ఇవ్విషయమున నేనేమియు జేయుదగిన స్థితియందు లేను. చేసినంతవఱకు శక్తివంచనలేకుండ జేసితిని. ప్రజాహితముగోరి నేనొనర్చిన కార్యములకు బ్రభుత్వమువారు న్యాయము దలంచి నన్నుఁ గారాగారనివాసునిగాఁ జేసినను నోర్చితిని. 1916 సంవత్సరారంభమునఁ బునహాపట్టణమందు, "ఆంగ్ల సామ్రాజ్యస్థ స్వరాజ్య" సంఘమును స్థాపించి, స్వరాజ్యప్రాప్తియే భరతఖండమునకుఁ బరమావధియని, నమ్మి యందులఁగూర్చి యత్నంబు జేసితిని.

Bound with the Assistance of
Raja Ram Mohun Roy Library Foundation.
Calcutta.

భ-పు—గంగాధరా! నీపడిన శ్రమలు నాకుఁ దెలియకున్నవా? 1916, 1917 సంవత్సరములలో లక్నోయందును, కలకత్తాయందును జరిగిన దేశీయసభలకు వెళ్ళి నీదేశభక్తిని సంపూర్ణముగ వెల్లడించితివి. భారతదేశ పరిస్థితులఁగూర్చి ప్రభుత్వమువారికి దెలిపి మనదేశమునకు స్వరాజ్యము గూర్చుటకై, కపర్దీ, కేల్కారు, బిపినచంద్రపాలు, సయ్యదు హుస్సేను గార్లతో నిండియాదొరతనమువారి యాజ్ఞఁ బొంది ఇంగ్లండునకుఁ బోవఁబయనమై సింహళము జేరునప్పటికి బ్రిటిషుదొరతనము వా రిప్పు డింగ్లాండు ప్రవేశమునుగూర్చి యేదో యుత్తరు విచ్చుటఁజేసి, మిత్రులతో మరలివచ్చితివి. అప్పుడు నీ వింగ్లండునకు బోయియున్నచో భరతవర్ష మీసరికెట్లుండునో.

తిల—భరతపుత్రా! జరిగినదానికై విచారించినందువలనఁ బ్రయోజనమేమి!

ఉ॥ గతజల సేతు బంధనమున ♦
కై తలఁపోయగనేల భారత
క్షితితల మింక సేచ్ఛఁగని ♦
శ్రేయములందుట యెట్టులంచు, నా
మతిఁ దలపోయుచుంటి దగు ♦
మార్గము దోచనుఁగాని; యిట్టి దు
స్థితి కలిగెన్ శరీరమున ♦
జేసెడి దేమిఁకఁ జెప్పు, సోదరా!

నాశరీరస్థితి మారిపోయినది. దేశమాత సేవఁజేయుట కింతయు నశక్తుడనైయుంటిని.

భ-పు—గంగాధరా! నీశరీరస్థితిఁ జూచిన నాకెంతయుఁ జాలికలుగుచున్నది. నీవు ప్రస్తుత మేదీనస్థితియందుంటివో, దానినెఱుంగక భారతమాత,

మ॥ అనఘాత్ముఁడవు శాంతమూర్తివి సము ♦
ద్యత్ ధైర్యసారుండవర్క
జనలోక స్తుత సచ్చరిత్రుఁడవు వ ♦
త్సా! చెప్పఁగానేల, నా
కును దొల్లింటి మహాయశంబు ద్వరలోఁ ♦
గూర్పంగలేలెమ్మి యం
చును సందేశము బంపె నీకిపుడు సం ♦
శుద్ధాత్మ యేమందువో.

తిల—తల్లిగారి సందేశమున కెంతయును సంతసించితిని. నేనింక నామె యెడల జేయవలసిన కార్యమేమియు లేదు. చేయదలఁచుకొన్నను భగవంతుఁడు నాకశక్తతను నిచ్చినాడు. నాదేహపాటవము దప్పునంతవఱకు నేవిధమయినలోటులేకుండ, నామె పాదారవిందసేవ సంపూర్తిగఁ జేసియుంటిననియే నేను గర్వపడుచున్నాను. స్వరాజ్యము నా జన్మహక్కని తలంచితిని. భారతభూమికి స్వరాజ్యము జేకూర్చుటకు యత్నించితిని. స్వరాజ్యము వచ్చునప్పటికి నేను జీవించి యుందునో, లేదో చెప్పజాలను. ఇంక నీభారతీయులకు గాంధీమహాత్ముఁడే శరణ్యమగు గాక! ఆతఁడు సామాన్యమానవుఁడు గాఁడు. సాక్షాత్ శ్రీ కృష్ణుఁడే యీగాంధీస్వరూపమున, భారతమాత సంతాపనివారణార్థమై యుదయించినాడని తలఁపవలయును. నేఁ జేయదలఁచిన కార్యములన్నియు నాతఁడు జేసితీరును. (ఇంచుక యూరకుండి) నీకొక్క పరమ రహస్య మెఱింగించెదను. పాంచాల పరాభవంబునఁ గలిగిన క్రోధంబే యగ్నిగాఁజేసి, ఆలీసోదరులు మొదలగు దేశభక్తులు, ఋత్విజులై యుండ, సకలభారతీయులును, హోతృవర్గమై యొప్ప, ధర్మసంస్థాపనార్థమై జననమందిన గాంధిమహాత్ముండుపదేష్టయై నిలువ, యధర్మమును బశువుగాఁజేసి, కాలనామకమహాపురుషుఁడు యాజియై, యజ్ఞంబు సేయును. ఆ ధర్మ

యాగమునకు గావలసిన పరికరములను సిద్ధముజేయుఁడని నీవు భారతీయులకు ప్రబోధింపుము. మఱియు, నాభరతమాతతో, "యతో ధర్మ స్తతో జయః" యను వాక్యమునే నమ్మి యుండు" మని నావాక్యములుగాఁ జెప్పుము. భగవ దనుగ్రహమున్నచో పునర్దర్శనము నాకు లభించుఁగాక.

భ-పు—లోకమాన్యా! నిన్నుఁ బరమేశ్వరుఁడు సర్వవిధముల రక్షించుగాక! సెలవిచ్చెద.

(నిష్క్రమించును.)

రంగము:— [బొంబాయిలో సర్దారు గృహము:—శయ్యపై **తిలకు** భగవద్గీత హస్తమునఁ దాల్చియుండును. కపర్ది, **కేల్కారు, మాలవ్యా**, గాంధి, షౌకతాలి, రామచంద్రతిలకు **మొదలగువారును**, వైద్యుఁడును నాతనినిఁ బరివేష్టించి **యుందురు.**]

రా-తి—(తండ్రినిఁ జూచి) తండ్రీ! ఇప్పుడు నీశరీరమున నెట్లున్నది?

తిల—ఇంచుక సుఖముగనే యున్నది. నీ వధైర్య మందవలదు.

శాంతి—అయ్యో! ఏమిసుఖము! నీ స్థితిజూచిన నాకెంతయు బెంగ కలుగుచున్నది. (విచారించుచు) జనకా!

తిల—(కుమారునిఁజూచి)

చ॥ కనులను నీరుగార జన ♦
కాయని యెందుల ఖేద్చెదయ్య యీ
తనువు లశాశ్వతంబు లని ♦
తద్దయు నెంచుచు నింకపైన నె

మ్మనమున ధైర్యమూనుము; ర ♦
మాపతి సర్వవిధంబులన్ నినున్
మనుచును గాత గోర్కె లను ♦
మానము లేక యొసంగుచున్ సదా.

శ్రీధ—తండ్రీ! నిన్నువిడచి మే మెట్లుండఁగలము. (కన్నుల నీరు గార్చుచున్నాఁడు.)

తిల—పుత్రులారా! మీరు ప్రపంచస్థితిఁ దెలిసియుండియు, వ్యామోహమునఁబడి యేల చింతించెదరు. జనన మరణములు రెండును ప్రతి జీవుని యందు నున్నవే. మీరు నాకై వగవంబనిలేదు. (ఇంచుక యూరకుండి) నేను విశేషముగ మాటలాడఁజాలను. ఆయాసము హెచ్చుగానున్నది. నాయనా! రామచంద్రా! వత్సా! శ్రీధరా!

తే. గీ॥ ఘన సుబుద్ధులు నాకంటెఁ ♦ గలరఁ జాలు
మీదు తల్లి దివికరిగె ♦ మిమ్ముఁ బాసి
పుత్రులారా! యికెట్టులీ ♦ పుడమియందుఁ
గ్రాలఁ గలరో జాగ్రత్తతోఁ ♦ గాల మెడఁగి.

అయినను బుద్ధిమంతులగు మీకు నేను చెప్పవలసిన విషయమెద్దియు లేదు. నాయశోవల్లికను బ్రాకించుభారము మీయందున్నది. (చుట్టునున్న వారిని జూచి) మిత్రమా? కేల్కారూ! గాంధీ!కపర్దీ!మాలవ్యా! ఇరుగో!రామచంద్ర శ్రీధరులు: ఇంకపై వీరియభివృద్ధియు క్షేమమును జూచుభారము మీయందున్నది.

కేల్కా—హా! తిలక్ మహారాజా! నీవాక్యములు నాకెంతయు దుఃఖమును గలుగఁజేయుచున్నవి.

కప—మిత్రమా! మాకేమి దారిఁజెప్పెదవు?

గాంధి—లోకమాన్యా! నీవు సామాన్య పురుషుఁడవుగావు. భగవత్స్వరూపుడవు. భారతదేశ నాయకుడవు. మహాపండితుడవు, ధీరోదాత్తుడవు, కర్మయోగివి. స్వార్థత్యాగివి. నిరంతర పరోపకార ధురంధరుడవు. లోకహితమువాటించి, మాండలేయందు గారాగృహవాసివైయుండియు, గీతారహస్యమును లోకమునకు వెల్లడించిన యపరకృష్ణుఁడవు. అట్టిచో నీవు మమ్ము విడనాడి దివి నలంకరించితివేని, దీనస్థితి నున్న యీభారతభూమికేది దిక్కు? స్వేచ్ఛారహితులైయున్న భారతీయులకు సౌఖ్యము లెట్లుచేకూరును?

తిల—(కేల్కారునుజూచి) కేల్కారూ! నీవు నేటివఱకును నాకనేక కార్యములయందు దోడ్పడుచు, నాయెడల బితృభక్తినిఁబూని సేవించితివి. నీ మహోపకారమును నేను మఱవజాలను. (గాంధిని విలోకించి) మిత్రమా! గాంధీ! నాదగ్గరకు రమ్ము.

గాంధి—(తిలకు పర్యంకమును సమీపించగా నాతఁడు గాంధిహస్తమును బట్టుగొని కూర్చుండఁజేయును.)

తిల—మిత్రమా! గాంధీ! నాకుఁ జేతనైనంతవఱకు దేశసేవఁ జేసితిని. స్వరాజ్యము మన జన్మహక్కని తలంచితిని. నేను మరణింపక పూర్వమే యట్టిది మన భరత వర్షమునకు సంప్రాప్తించుట కన్నులారఁ జూచెద ననుకొంటిని. కాని యట్టిది ప్రాప్తించలేదు. "రాజ్యాంగ విషయములలో సహజముగ నభిప్రాయభేద మెల్లవారికివలె నాకుఁగూడ నుండి నందువలన, చక్రవర్తిగారి పరిపాలనమునకు నేను విరుద్ధ భావము వహించితి ననిగాని, విరుద్ధముగఁ బని సేయుచుంటి ననిగాని యెంచుట హాస్యాస్పదము. అది నా యుద్దేశముగాని యాశయముగాని కాదు. పరిపాలనా విధానముల మార్చుటకు నైర్లాండులో నైరిషు స్వరాజ్యవాదులు ప్రయత్నించుచుండున ట్లిండియాలో మనము ప్రయత్నించుచున్నామనియు, దొరతనము వారిని వెడలఁ గొట్టుటకుఁ బ్రయత్నించుట లేదనియు నేను స్పష్టపఱచుచున్నాను. ....నాగరకత గల పరిపాలనా విధానమునే

గాక, కాల క్రమముగ హిందూ దేశములోని యన్ని జాతులకు నన్ని తెగలకు నేకీభావము గలిగించి, తన్మూలమున, సంయుక్త జాతీయత పెంపు బొందునట్లు బ్రిటిషు పరిపాలనము మహోపకార మొనరించు చున్నదని న్యాయముగఁ జెప్పఁబడు చున్నది. ...." అని నే నొకచోట వ్రాసి యున్నాను. ఈసంగతులు మనస్సులో నుంచుకొనుము. ఏది ఎట్లయినను, హిందూ మహమ్మదీయ సమ్మేళనము పూర్తిగ నుండినఁ గాని భరత వర్షమునకు స్వరాజ్య ప్రాప్తి చేకూరదు. (షౌకతాలీనిజూచి) షౌకతాలీ! ఈ విషయమున నీవు గాంధికి సర్వవిధముల తోడు నీడగా నుందువనియే నా నమ్మకము (గాంధినిఁ జూచి) నీవు తలంచిన సహాయనిరాకరణమును, సాధక బాధకంబు లెఱింగి, యాచరణలోఁ బెట్టుము. ఏ కార్యము నైనను దలపెట్టిన పిదప దానిని విడువరాదు.

" తేజస్వినస్సుఖమసూనపి సంత్యజంతి
సత్యవ్రతవ్యసనినో నపునః ప్రతిజ్ఞామ్॥ "

అను వాక్యమును మాత్రము మఱచి పోవకుము. వేయేల!

తే. గీ॥ దీనగతినొందియుండిన ♦ దేశమాత
నుద్ధరింతుసను, ప్రతిన ♦ నొప్పమీఱ
దాల్చెదవయేని హాయిగా ♦ ధరణిఁ బాసి
దివికినేగెద నేనింక ♦ దివ్యపురుష.

(ఇంచుక యూరకుండి) ఒక్కసారి కన్నులు మూసి తెరవుము.

గాంధి—(అట్లుచేసి) లోకమాన్యా! ఈ అద్భుతమేమి? నాచిత్తమంతయు మాఱిపోయినది.

చ॥ అదియొక నూతనంబయిన ♦
యంచిత శక్తి యదేమొగాని నా
హృదయము నందుఁ జొచ్చెనిపు ♦
డొప్పగనేమని చెప్పవాఁడ స
మ్ముదమున నెట్టికార్యభరమున్ ♦
వహియించి మెలంగువాడ నీ
మది నిసుమంతయేని యను ♦
మానము వీడుము లోకసన్నుతా.

తిల—గాంధీ! నేను కృతార్థుఁడ నైతిని.

"శ్లో॥ కర్మణ్యే వాధికారస్తే మాఫలేషుకదాచన
మాకర్మఫలహేతుర్భూః మాతే సఙ్గోఽస్త్వకర్మణి."
(గీతాస్మరణ జేయుచున్నాఁడు)

కేల్కా—అయ్యో! లోకమాన్యుఁడు కన్నుమూయుచున్నాడు.

పక—అక్కటా! ఇంకేమున్నది?

రామ—తండ్రీ! తండ్రీ!

గాంధి—ఈ సమయమున మీరందరును నీ యోగపురుషుని నిష్ఠకు భంగము సేయకుఁడు. ఈతఁడన్ని విధముల ధన్యుఁడు.

తిల—(మందరస్వరముతో)
"యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహం."
(ప్రాణములు విడుచుచున్నాఁడు.)

రామ—హా! జనకా! లోకసన్నుతగుణజాలా! మమ్ముఁబాసి దివికేగితివా! ఇంక మాకేమిదిక్కు. మిక్కిలి శ్రమనంది నీవు రచించిన గీతారహస్య తత్త్వము మాకిప్పుడింక బోధించెదరు?

శ్రీధ—తండ్రీ! మమ్ము విడనాడిపోవుటకు నీ చిత్త మెట్లుసమ్మతించినది. నాయనా! శ్రీధరా! స్వరాజ్యము మనము కన్నులఁ జూతుమని జెప్పుచుండెడి వాడవే. భారతీయులకు స్వరాజ్యము చేకూర్పకుండనే పోయితివా? ప్రతికార్యమునందును వెన్నంటి తిరుగుచుండు నీ ప్రాణ సఖులగు, కేల్కారు, కపర్డీ, గాంధీ మొదలగువారిని విడిచిపెట్టుటకు నీ చిత్త మెట్లు సమ్మతించినది. నీ మరణమునకు నాసేతు హిమాచలస్థ ప్రతి భారతీయుఁడును గుందునని యైనఁ దలంపవైతివే.

గాంధి—(శ్రీ ధరరావును జూచి) శ్రీధరా! ఏమి! ఈ అజ్ఞానము, అట్టి వానిగర్భమున జన్మించిన నీకీ వెఱ్ఱియేమిటి? మీతండ్రియుపదేశించిన గీతా రహస్యమేమి చేసితివి. ఇదియేనా నీధైర్యము. చాలు చాలు. ఊరడిల్లుము. మీతండ్రి సామాన్య మానవుఁడు గాడు. ఈతఁడవతారమూర్తి. ఈతడు చేయఁ దలఁచిన పనులన్నియుఁ జేసి, అవతారము జాలించి నేడు విష్ణునితో నైక్యమును బొందినాడు. ఈసమయమున నాతని మిత్రవర్గమంతయు నిచ్చట నున్నది. బంధువు లెల్లరును జేరియుండిరి. విశేషించి కుమారులగు మీ రిరువును నుండిరి. ఇంతికంటె నీలోక మాన్యునకుఁ గావలసిన దేమున్నది? ఈతఁ డన్నివిధముల ధన్యుడు.

కేల్కా—

సీ॥ దివ్యమై యలరారు ♦ దేశభక్తి జనుల
హృదయ సీమలయందు ♦ నింపుమీఱ
నాటి, దేశమునకై ♦ పాటుబడి జగతి
నవతారమూర్తియే ♦ యనుచు నెల్ల
వారుఁ దలఁప జగ ♦ త్ప్రాంతిగోలిపి యైంద్ర,
జాలికునికరణి ♦ నాత్మ తలంబు

భాసి యరిగితివె ♦ స్వర్గంబునకు ♦ నీవు
"నాకు మాఱుగమీదు ♦ నాదుపటము
వీక్షింపుచు వగవు ♦ విడనాడుడీ యంచు
బలు భంగులను మాకు ♦ బలికి పలికి
త్వచ్ఛరీరము మాటు ♦ పఱచితి వంతియే
కాని యెల్లదిశల ♦ గ్రాలుచున్న

తే॥ గీ॥ భవ్య భవదీయ కీర్తిఁ దా ♦ పంగఁ గల్గె
విమల గీతారహస్య సం ♦ వేదివైన
నిన్ను, నీదేశ భక్తి వ ♦ ర్ణింపఁ దరమె
లోకసన్నుత గుణజాల ♦ లోకమాన్య.

గాంధి—మిత్రులారా! విచారమున కిది సమయము గాదు. చేయ వలసిన పనులు చాలా యున్నవి. అదుగో! లోకమాన్యుని మరణము విని పురవాసులందఱును నిల్చి వచ్చుచున్నారు. ఆపవిత్ర చరిత్రుని శరీరమున కగ్ని సంస్కారాది క్రియలు మహా వైభవముతోఁ జేయవలయును గాన దత్ప్రయత్నమున నుండవలయును. రండు.

(తెరవాలును)

ఇది ద్వితీయాంకము

స్వ రా జ్య ధ్వ జ ము

తృ తీ యాం క ము

రంగము:—అరణ్యము—(కొండ గుహాయందుఁ బ్రవేశము:- విచారముతో భరతమాత)

భ-మా—(తిలకు నుద్దేశించి) హా! లోకమాన్యా! నీ దేశీయ సోదరుల నందఱను విడిచి పెట్టి నీవు దివం బలంకరించితివా? దాస్య బంధముల గట్టుబడి యున్న నాకు విముక్తి గలిగించి, నీ సోదరులకు సుఖము గూర్తువని తలంచితినే. అక్కటా! నా యాశ యంతయు నిరాశ యయ్యెనుగదా! స్వరాజ్య ప్రాప్తి కెంతయో ప్రయత్నించితివి. అట్టి యీ దేశమునకుఁ జేకూరకుండనే నీవు మమ్ముఁ బాసి పోయితివా?

తే॥ గీ॥ దేశ హితము పాటించుచు ♦ దివ్యమతిని
నిడుములం బొంది నాడవు ♦ పుడమి యందు
నింక నెవ్వరు నీవలె ♦ శంక లేక
పుడమి నుద్ధరించెద రయ్య ♦ కొడుక! చెపుమ.

ధర్మ పథానువర్తి వగు నీవు భరత వర్షమున జరుగుచున్న యధర్మ కార్యములనుఁ జూచి సహింపలేక పోయితివా? వత్సా! లోకమాన్యుడను బిరుదు నీ యందే సార్థకం బయినది. ప్రజల సుఖముల కై నీవు గడు శ్రమ లందితివి. కారాగృహ శిక్ష ననుభవించితివి. హా! గంగాధరా! నీ వీ లోకము బాసి పోయినను నీ మూర్తి మాత్రము నాకన్నుల యెదుట గట్టి నట్లున్నది.

సీ॥ పరుల పాలైయిట్లు ♦ పడరాని యిక్కట్ల,
నెన్నిరీతుల బడుచున్న ♦ నన్నుబాసి
విమల స్వరాజ్యంబు ♦ సమకూర్తు వీవని
నమ్మిన యఖిల జ ♦ నమ్ము వీడి
నిరతంబు నీతోడ ♦ జరియించు చుండిన
పరమ గుణులు మిత్ర ♦ వరుల మఱచి
భవదీయ సేవయే ♦ స్వర్గ సుఖంబని
తలపోయుచుండు పు ♦ త్రకుల విడచి

తే॥ గీ॥ చుట్ట పక్కంబు లందఱ ♦ శోకవార్ధి
ముంచి, దివికేగ నీకేల ♦ బుద్ధి వొడమె
భారతీయులకు స్వరాజ్య ♦ భాగ్యమబ్బు
మార్గమునకునై యత్నించి ♦ మహిత చరిత!

ఇంక నీవలె నన్నుద్ధరించుటకుఁ బ్రయత్నము సేయువా రెవ్వరు? ఈ భారతీయుల కష్టంబులెట్లు గట్టెక్కును? ఇంతవఱకును ననేక కష్టముల పాలయితినని విసుగుజనించి నీవు మమ్ముఁ బాసితివా! హా! లోకమాన్యా!

సీ॥ నిర్మోహ మనుభూతి ♦ నిండుఁగాఁ బూనియు
ధర్మ కమండలి ♦ దాల్చి యుండు,
గరుణా రసజలంబు ♦ గ్రహియించి సమభావ
వసనంబు ధరియించి ♦ భవ్యశాంతి
యనెడు జటాజూట ♦ మతి ముదంబునఁబుట్టి
సుజ్ఞాన పాదుకల్ ♦ సొంపుమీర
దొడగి, విరాగివై ♦ వడిగ బ్రహ్మోటవీ
గమ్నుఁ దపంబును సేయ ♦ గాంక్షతోడ

తే. గీ॥ నారు మూడౌ గిరి ప్రవా ♦ హముల దాటి
సచ్చిదానందమూర్తివై ♦ చనితె నీవు
ప్రాకటంబుగ మమువీడి ♦ లోకమాన్య
బాలగంగాధరతిలక! ♦ భవ్యచరిత.

నీవు దేశోద్ధారణకుఁ బడిన కష్టములు, నా కెన్నటికిని మరుపునకు రావు; కాని నాకు దాస్యబంధనము దొలంగింపకుండ నీవు దివి కేగినందులకు మాత్రము చింతించెదను.

(భరతపుత్రుడు - ప్రవేశించును.)

భ-పు—(భరతమాతను జూచి) అమ్మా! భగవత్స్వరూపుఁ డయిన లోకమాన్యుని మృతికై నీవేల యీరీతిఁ గుందెదవు. ఆతనిని సామాన్య నరునిగా భావింపరాదు. ఆతఁడొక యవతార పురుషుఁడు. ఆతఁడు జన్మించి చేయవలసిన పను లన్నియుఁ జేసినాడు. అవతారము జాలించినాడు.

భ-మా—పుత్రకా! నీవు చెప్పిన ట్లాతఁడు నిశ్చయముగా నొక యవతార పురుషుఁడే. కాకున్నచో దేశోద్ధరణకై యిన్ని కడగండ్లఁగుడచునా! ఇవి యట్లుండుము, సాక్షాత్ శ్రీమన్నారాయణాంశ సంభూతుఁడే గాక పోయినచో గీతారహస్యము వెల్లడింపఁ శక్తుడగునా? ఆ మహాత్మునిచే విరచితమగు నా భగవద్గీతా రహస్యము ప్రతి భారతీయుని చేతనుఁ బూజింపఁబడ దగినదికదా! (ఇంచుక యూరకుండి) కుమారా? లోకమాన్యుని శవ దహనాది కృత్యము లోక పెండ్లికార్యమును మించియుండుననియే తలంచెదను.

భ-పు—అమ్మా! లక్ష పెండ్లిండ్లనుమించి యుండెను. ఆ వైభవము కన్నులారఁ జూచితీరవలెను. లోకమాన్యుని మృతకళేబరము పుష్పములచే నలంకరింపఁబడిన యొక పల్లకియందుంచి, నగరమునం దెల్ల నూరేగించుచు శ్మశానవాటికకుఁ గొనిపోబడెను. శవము వెంటనున్న

జన మింతయని లెక్కింప నలవికాదు. వేయేల! బొంబాయి నగర మందున్న జను లందఱును వెంటనుండిరనియే చెప్పవచ్చును. దేశ నాయకు లందఱును నుండిరి. మహాత్మ గాంధి, కేల్కారు, కపర్ది, షౌకతాలీ మొదలగు మహనీయులు శవ వాహకులయిరి.

భ-మా—ఆహా! ఏమి వారిభాగ్యము.

మ॥ అల విష్ణుప్రతిమానరూపుఁడయి యా ♦
హా! జన్మముఁ గాంచి, ని
ర్మలభావంబున దేశసేవకు నిజ ♦
ప్రాణంబులన్ ధారవో
సి; లలిన్ దేశ గడించినట్టి తిలకు ♦
శ్రీకీర్తి కాయంబు మో
సి, లసత్ప్రాభవ మందిరీ భరత దే ♦
శీయుల్ మహత్ప్రాభవుల్.

భ-పు—నిశ్చయముగా వారు మహాపుణ్యమునే జేసియుండిరి. అమ్మా! నాటి దినమున లాలాలజపతిరాయి, శవము శ్మశానవాటికకుఁ గొనిపోయిఁ చితిపైఁ బెట్టిన సమయమున కరుదెంచి, యా లోకమాన్యునిగూర్చి పలు విధములఁ జింతించెను.

భ-మా—ఆ గంగాధరుని మృతికిఁ జింతింపనివా రెవ్వరు. ఆతఁడు స్తమించుట నాకు లోకమంతయు నస్తమించినట్లున్నది. (చింతించును.)

భ-పు—అమ్మా! నీవు చింతింపవలదు. లోకమాన్యుఁడు పోయినంత మాత్రమున మన భూమికి స్వరాజ్యభాగ్యంబు ప్రాప్తించదని తలంపవలదు. శ్రీమన్నారాయణ స్వరూపుఁడైన యా మహానుభావుని యంశ మహాత్ముఁడగు గాంధి యందుఁ బ్రవేశించినది. ఇంక మనకు గాంధీయే దిక్కు. భరతవర్ష మాతనిచే నుద్ధరింపబడును. అమ్మహాత్ముఁడు

కొలది దినములలోనే, ఆలీసోదరులు, చిత్తరంజనదాసు, మోతీలాల్ నెహ్రూ, లజపతిరాయి తనవెంటరా భరద్దేశ్యాన్గమై యరుదెంచును. రమ్ము— ధైర్యమున నుందుము—

(ఇరువురును నిష్క్రమింతురు.)

రంగము:—(అరణ్యమందు కొండగుహా ప్రవేశము:—

భరతమాత; భరతపుత్రుడు; లజపతిరాయి; షౌకతాలీ; చిత్తరంజనదాసు; మోతీలాలు నెహ్రూ; మహమ్మదాలీ.)

భ-మా—(అందఱిని జూచి) పుత్రులారా! ఇప్పటికి భరతమాత యున్నదని జ్ఞప్తికి వచ్చినదా!

సీ॥ “కాలత్తు” పాంచాల ♦ రాష్ట్రంబు నందు ప్రబ
వేశంబుఁ గావించి, ♦ వెలుగునాఁడు
సభకునై గూడిన ♦ జనులపై డయ్యరు
బల్ తుపాకులగుండ్లు ♦ వదలునాఁడు
పెద్దపిన్న లటంచు ♦ వీక్షింప కుండంగ
బాంచాలురను హింస ♦ బఱపునాఁడు
కఠినాత్ముఁడనమాచుఁ ♦ గ్రాలిన “మార్షలు”
“ఆక్టును” నిర్మించి ♦ యేలునాఁడు

తే॥ గీ॥ మీర లందఱు తే మూలల ♦ మెలఁగినారు
ప్రాణములపైన తీపిచేఁ ♦ బాఱినారె?
నేటికీ తీరి వచ్చిరే ♦ నిఖిల కష్ట
ములను బొందెడి నన్ జూచి ♦ బోవఁదలఁచి.

వత్సలారా! మీర లందఱును నిప్పటికైనఁ గన్నులు దెఱచి నందులకు సంతోషించుచున్నాను. దాస్యశృంఖలముల నుండి మీ రెప్పుడు విముక్తినంది నాకు సౌఖ్యము గూర్తురు. భారత జాతియుఁ తయు బరాశ్రయమున మెలఁగుచుండుటచే, స్వార్థత్యాగము, ధర్మ పరత, సత్యసంధత, శౌర్యము, యుత్సాహము మొదలగునవి యన్నియు నశించినవి. ఇవి యన్నియుఁ బునరుద్ధరింపఁ బడవలెను.

శౌకి—తల్లీ! నీవు చెప్పిన మాట సత్యము. భారతీయులు పరదాస్య బంధ నంబులచే నెప్పుడు కట్టుఁబడిరో యానాఁడే వీరి ధర్మము, సత్య సంధత, స్వార్థత్యాగము, పౌరుషము మొదలగు గుణములన్నియు నశించినవి.

భ-మా—కుమారులారా! మీ రందఱును విద్యాప్రవీణులు. చరిత్రలవలన నేను పూర్వ మెట్టిసౌఖ్యము లందియుంటినో యవి యన్నియు మీరు చదివియేయుండిరి. అంతయు దెలిసియుండియు నా విషయమై పట్టుదల బూనకయుండి రేలని

లజ—(భరతమాతను జూచి) అమ్మా! పుత్రులను మన్నింపవలయును.

ఉ॥ ఇంతకుమున్న నీసుతు ల ♦
హీనగుణాఢ్యులు నిన్నుగూర్చి కా
సింతయు శ్రద్ధఁ గైకొనక ♦
చేరిరి నిద్రను నేఁడు "గాంధి" సి
ద్ధాంతముపైన నీఘన ప ♦
దద్వయ సేవను సేయఁగోరి, ని
శ్చింత మనస్కులై పనులఁ ♦
జేయుచు నుండిరి దీక్షబూనుచున్.

భ-మా—గాంధి సిద్ధాంతమున కీ మధ్యమున చిత్తరంజనుఁడేదియో యించుక యాటంకము గలిగించినాఁడని విని యుంటిని. మీలో మీకిట్లభి

ప్రాయ భేదమున్నచో నన్నెట్లుద్ధరింతురు. మీ రెట్లు సుఖముల గాంతురు. (దాసునుజూచి) నాయనా! చిత్తరంజనా! సమస్త విద్యాప్రవీణుఁడవైన నీవుగూడ నిట్లొనర్చితివేమి? నీవు నివసించు నీ ప్రదేశము కడు పవిత్రవంతమైనది. ఇంతకుమున్ను ఖండమును బాలించిన మహారాజులు నా కెంతయో సౌఖ్యమునుగూర్చిరి. ఇప్పుడు మన దొరతనమువారు భారతసామ్రాజ్యమునకు రాజధానీ నగరముగ జేసికొనిన ఢిల్లీపురమే పూర్వ మింద్రప్రస్థమన భాసిల్లెను. అది సామాన్యమైన నగరముగాదు.

సీ॥ అది, యుధిష్ఠిరుఁడు స ♦ మ్ముదముతో రాజసూ
యాధ్వరంబును జేసి ♦ నట్టిచోటు
అది వీరశేఖరుం ♦ డైన పృథ్వీపతి
యతి ధర్మమున నేలి ♦ నట్టి స్థలము
అది పాదుషా యైన ♦ యక్బరు జాతీయ
భావంబు నిలిపిన ♦ భవ్య భూమి
అది శూరులౌ తురు ♦ ష్కావనీశ్వరుల మ
యూర సింహపీఠ ♦ మున్న నెలవు

తే॥ గీ॥ అనుచు జనులెల్ల వినుతింప ♦ నలరినట్టి
మహిత ఢిల్లీపురీమణి ♦ మాన్యచరిత!
యిప్పుడేరీతి నున్నదో ♦ యీవుగంటె
కాల మొకరీతి నుండదు ♦ గాదె జగతి.

గతించినదాని కిప్పుడు విచారింపనేల! ఇంక మీరందఱును గలిసి యొక మాటపై నిలిచి భరతభూమి నుద్ధరింపుఁడు.

లజ—(భరతమాతను జూచి) అమ్మా! చిత్తరంజనుఁడు తొలుత నేదో కొంత యభిప్రాయ భేదమున మహాత్ముండగు గాంధితో

వేమ్మెళ్ళా పత్రికెన్నుగాని యిప్పు డాతని మనస్సు నిష్కళంకముగ నున్నది. దేశ సేవను సంపూర్తిగ జేసి నీకు సమ్మోదము గూర్చును. వేయేల! నీ సేవ జేయుట కీతఁడు తనకు నెలకు ముప్పదివేల రూపాయల లాదాయము వచ్చు న్యాయవాది వృత్తిని దృణప్రాయముగఁ దలఁచి పరిత్యజించినాఁడు. నీవు సంశయింపఁబని లేదు.

చిత్త—భారత జననీ! ఎట్టి దుర్ఘట కార్యమైన జేయుట కీసేవకుఁడు సిద్ధముగ నున్నాడని యెఱుంగుము.

భర-మా—(షౌకతాలీనిఁ జూచి) కుమారా? షౌకతాలీ! నీవు మహమ్మదీయుఁడ వైనను నాకు బుత్రుఁడవె! మీ మతమువారికి దొరతనము వారు జేసిన యన్యాయమునుగూర్చి వింటిని. ఇట్టిపని వారు జేయుదురని నేనెన్నఁడును గలనైనఁ దలపలేదు. అక్కటా! కాలమెట్లుగా మాఱిపోయినది. తుర్కీ రాజ్యమునకు వారుమిగుల నన్యాయము గావించిరికదా! ఈ విషయమై నీవుగడు విచారించు చుంటివని తెలియ వచ్చినది.

శా॥ డెందంబందుఁ దలంచి చూడుమిఁక మీ ♦
దీవిం బెడం బాసి మీ
రెందుఁ సౌఖ్య మటన్న మాటెఱుంగ కే ♦
యీబాధలం బొందుచుఁ
గుందంగారణ మేమి యీ విధములో ♦
కుల్లూచిరఁ మెత్తురే
హిందూస్థాన కుమార లెమ్మికను లె ♦
మ్మీ! మాతృ సేవార్థమై.

షౌక—అమ్మా! హిందూ మహమ్మదీయ [illegible]మ్మేళన మొనరించి సందులకు మహాత్ముఁడగు గాంధీ కనేక సలాములు జేయుచున్నాను. మేమును హిందువులును మా పూర్వపు పగలను మఱచిపోయినాము. స్వరాజ్య

సంపాదనకై గాంధీ మహాత్ముని యాజ్ఞ ననుసరించి పనిచేయుటకు మేము నడుములు గట్టుకొని యున్నాము.

చిత్త—తల్లీ! ఈ షౌకతాలీ యెప్పుడును గాంధిని విడువక యుండి యెట్టి కార్యము నైనను జేయుచుండును. ఈతఁ డతిసాహసుడు. పట్టిన పట్టు విడుచువాడు కాఁడు. ఎప్పుడాలీసోదరులు గాంధీమహాత్ముని యాజ్ఞాబద్ధులై యుండిరో యప్పుడే నీకు జయము జేకూరినని తలఁపుము.

షౌక—ఎప్పుడు టర్కీకి నపకారము జరిగెనో యాదినమే హిందూ మహమ్మదీయ జాత్యైక్యత గలిగెనని నమ్ముము. ఇంతకుమున్ను టర్కీవిషయమై కలిగిన క్రోధాగ్నిని, పంజాబు దురంతములు మఱింత ప్రజ్వరిల్ల జేసినవి.

చిత్త—భారతమాతా! ఏనాఁడు షౌకతాలీ గాంధీమహాత్మునకు నెయ్యంపు సఖుఁడై యొప్పెనో యానాఁడే భారతదేశమునకు స్వరాజ్యము చేకూరినట్లు తలఁపవలయును. నీ పుత్రులమగు మేము స్వేచ్ఛారహితులమై యుంటిమనియు, నీవు పూర్వవైభవముబాసి యుంటివనియు, జింతింప నవసరములేదు. మే మందఱమును నెట్టి కష్టములు వచ్చినను ననుభవించుటకు సంసిద్ధులమై సత్వర స్వరాజ్యసిద్ధికై యత్నములు సలుపుచుంటిమి. ఇవియంతయు నేల!

సీ॥ ఇది ధర్మము నధర్మ ♦ మిదియంచు వచియించు
విద్యామనీషులు ♦ వెలసియుండ
గార్యదీక్షు విడువ ♦ క పనిచేయుచు నున్న
రమ్యగుణులు మహా ♦ రాష్ట్రులుండ
పట్టిన ప్రతినకు ♦ భంగంబు రాకుండ
జే[illegible]రసుత ♦ శ్రేష్ఠులుండ
"ఫిక"రేమి మాకంచు ♦ బ్రికటితంబుగఁ బల్కు
మహిత ధీరులు మున ♦ ల్మానులుండ

తే॥ గీ॥ అన్నివిధముల శ్రేష్ఠులౌ ♦ యాంధ్రులుండ
వేయునేటికిఁ దల్లిరో ♦ వినగదమ్మ
గాంధి శ్రీ పాకతాలీల ♦ కంఠములను
బ్రాణముండ నీకేమి కొ ♦ అంత కలుగు.

మోతీ—చిత్తరంజనా నిజము చెప్పితివి.

లజ—మహాత్ముడు గాంధీ ప్రవేశపెట్టిన యసహాయోద్యమమే మనకు స్వరాజ్యము సిద్ధింపజేయును.

భర-మా-ఆ యసహాయోద్యమ తత్వమేమో యొక్కింత యెఱింగించెదవా?

లజ—జననీ! ఇయ్యది స్వరాజ్యమునకై మనము దొరతనము వారితో బోరాడుటకు గాంధీ మహాత్ముడేర్పఱచిన దౌర్జన్య రహితమైన యుద్యమము. నేటివఱకును మనము ప్రతివిషయమునందును దొరతనమువారికి సహాయము సేయుచుంటిమి. ఇంకముందెట్టి కార్యముల యందైనను వారికి తోడ్పడకుండ నుండుటయే యీయుద్యమము యొక్క రహస్య తత్వము—ఈ యుద్యమమును గూర్చి గాంధీ మహాశయుడు సంపూర్తిగ నాలోచించి ప్రస్తుతము మనకు జేయవలసిన కార్యములు కలకత్తా స్పెషల్ కాంగ్రెస్సులో జెప్పియున్నాడు.

భర-మా—కుమార అవి యేవో వినవచ్చునా?

లజ—దొరతనము వారిచ్చిన బిరుదులను పరిత్యజింపవలెననియు, గౌరవార్థమై వారొసంగు పదవులను నంగీకరింపవలదనియు గవర్నమెంటు వారివలన స్థాపింపఁబడినట్టియు వారియధికారమున నున్నట్టియు వారిధన సహాయమున జరుగుచున్నట్టివియునగు పాఠశాలలకు మన బాలురను బంపుటమాని వేసి జాతీయ విద్యాశాలలు నెలకొల్పవలెననియు వ్యవహారములను చక్కజేసికొనుటకు బంచాయితీల నేర్పాటు జేసికొనవలసినదనియు. కూలీలు గుమాస్తాలు సైనికులు మొదలగు వారెవ్వరును

మెసపొటేమియా కరుగకుండ నుండవలయుననియు నూతన శాసనసభలలో నెవ్వరును సభ్యులుగా జేరగూడదనియు స్వదేశవస్తు ప్రచారము గలుగజేసి విదేశవస్తు బహిష్కారము జేయవలసినదనియు నా మహాత్ముడు చెప్పియున్నాడు. ఇవియన్నియు మొన్న డిశెంబరు నెలలో జరిగిన నాగపుర కాంగ్రెసులో స్థిరపఱుపబడినవి. కాని విద్యార్థులను గూర్చి మాత్రము మఱియొకతీరున నేర్పాటు జేసిరి. విద్యావిషయమై పదియారు వత్సరములను మించినవారు వారిష్టము వచ్చినట్లు చేయవచ్చుననియు నంతకు తక్కువయీడుగల బాలురు తల్లిదండ్రుల యభిప్రాయము ననుసరింపవలయు ననియు దీర్మానింపఁబడినది.

భర-మా-గాంధీ మహాత్ముని యొక్క యాధ్యాత్మిక శక్తి మిగుల సర్వసాతీతము. దౌర్జన్య రహితమైన యీ యుద్యమమువలన భారతీయులు సత్వర స్వరాజ్య సిద్ధినంది సుఖింతురు గాక:—

లజ—అమ్మా! మహాత్ముఁడు జనుల కింకొక్కటి ప్రబోధించుచున్నాడు. ప్రతియింటను నూలు వడకు రాట్నములుండవలయుననియు, ఆ రాట్నములందు స్వయముగా నొడికిన నూలుచే నేయఁబడిన వస్త్రములనే ధరింపవలయుననియు, భారతదేశ లక్ష్మియంతయు నా రాట్నములందే యున్నదనియు నాతఁడు చెప్పుచున్నాఁడు.

భర-మా-గాంధి వచించిన మాట సత్యమే. మన భాగ్యమంతయు రాట్నమునందే నిలచియున్నది. ఈరహస్యము నాతఁడు గ్రహించినాడు.

లజ—ప్రతివారును రాట్నములపై వడికిన నూలుతో నేయఁబడిన వస్త్రములనే ధరించుచున్నారు. విదేశ వస్త్రములు చాలభాగము బహిష్కరింపఁబడినవి. అమ్మా! అటు చూడుము. గాంధీ మహాశయుని ప్రబోధమాలించి ఘనచిత్తరంజనుఁడు తన యమూల్యమగు విదేశ వస్త్రములను బరిత్యజించి యెట్టి ముదుకగుడ్డల ధరించినాఁడో. ఈ మోతీలాలు నెహ్రూను వీక్షింపుము. ఈతఁడెట్టి వస్త్రములను దాల్చినాఁడో.

భ-మా-(దాసు-నెహ్రూలను జూచి) సుకుమార శరీరులగు మీరు నాకై తొట్టి వసనముల ధరించితిరి?

చిత్ర—అమ్మా! ఇది భరతమాత మాకు మహదానందము. ఇంత వఱకును నే మేగాక భారతీయు లెల్లరును నజ్ఞానాబ్ధిలోఁబడి నిద్రబోయినారు. నేటికిఁ గన్నులు దెఱచినారు. ఇకను మున్ను కాలగర్భమునఁబడి నష్టములైపోయిన కళలు, పరిశ్రమలు, జాతీయవిద్య మొదలగునవి పునరుద్ధరింపఁబడును. తల్లీ! నీకుమారులు దాస్యవిముక్తి నందఁగలరు. నీవు పూర్వౌన్నత్యమును బొందగలవు. సంతోషమున నుండుము.

(తెరలో)

ఆహా! నాగోల నెవ్వరును విచారింపకుండిరే. ఓతల్లీ! భరతమాత దాని దుఃఖమునుగూర్చి నీవైనను నీ భారతదేశ నాయకులతోఁ జెప్పి నన్ను రక్షింపవా! అధర్మపరులచేఁ బరాభవింపఁబడి నే నీరీతిని నుండవలసినదేనా?

షౌక—ఎవ్వరదీ కంఠధ్వని స్త్రీ యార్తరవమువలె నున్నదే. పాప మామె యేమిటి యుపాయమునఁ గూలినదో ఇదే పోయి యామెను రక్షించెదఁ గాక. (ఇంచుక ముందుకు నడచును.)

గాంధి—(ప్రవేశించి షౌకతాలీనిఁ జూచి) షౌకతాలీ! శాంతింపుము.

(భరతమాత తప్ప తక్కినవారు నమస్కరింతురు.)

భ-మా—గాంధీ!

సీ॥ సత్యాగ్రహ వ్రత ♦ స్థాపనం బొనరించి
నందుకేఁ జెఱయు ముదం ♦ బందినాను
పంజాబు కేగుచో ♦ వలదని "యరెస్టు"
జేసినందులకుఁ జింత ♦ జెందినాను
"అసహాయ" పాశుప ♦ తాస్త్రంబు సంధించి
నందుకు సంతోష ♦ మొందినాను
పులిని మేకను నొక్క ♦ స్థలమున నీర్త్రావ
జేసినందుకు సంత ♦ సించినాను

తే॥ గీ॥ భక్తితో నన్ను జూడంగ ♦ వచ్చియుంట
గాంచి, మదిలోన హర్షంబు ♦ గాంచినాను
కోర్కె లికపైన నా కొనఁ ♦ గూడకున్నె
ధన్యఁ రాలఁ గాకుంమనే ♦ ధాత్రియందు.

గాం—జననీ! నీ మహదాశీర్వచనము నా కొసంగినచో నెట్టి కార్యముల నైనను జేయుటకు సంసిద్ధుఁడనై యుందునని యెఱుంగుము.

షౌక—(గాంధీనిఁజూచి) మహాత్మా! అదిగో! పాంచాలి యార్తరవము వింటివా! ఇఁక నే నొక్కింత కాలమైనను దాళఁజాలను అనుగ్రహింపుము.

గాంధి—మిత్రమా! షౌకతాలీ! నీవు శాంతింపుము. ఈ శాంతమునుగూర్చియే నేను నీకు రహస్యముగ బోధించినది. యోధులు జగద్విఖ్యాతికి పాత్రులగుదురను మాటకు సంశయములేదు. కాని మనకా యోధ జీవనము వలదు. యోధ జీవనమువలెనే శాంత జీవనముగూడ మోక్షమునకు మార్గమే. మనమిప్పుడు శాంతజీవన మాశ్రయింతము. ఇయ్యది దౌర్జన్యరహితము. దీనికి శస్త్రములుగాని, ఖడ్గములుగాని యవసరములేదు. నేనిట్లు చెప్పితినని మన పూర్వులు యోధులు గారని నీవు తలంపవలదు. వారు భీకరసంగ్రామ రంగములయందుఁ దమ పవిత్రమైన శరీరములనుండి రక్తము గార్చినవారే. ఆ కాలపు వారి కది బాగున్నది. ఇప్పుడు మన మా యోధ జీవనము జోలికి బోవలదు. శాంతిజీవన మాశ్రయింతము. దానివలన సకల కార్యములును జక్కబడును.

షౌక—మహాత్మా! క్షమింపుము. నీయాజ్ఞకు బద్ధుఁడను.

భర-మా-(పాంచాలినిజూచి) అమ్మా! పాంచాలీ! నీవు చింతింపకుము. సాక్షాత్ శ్రీకృష్ణ రూపుఁడైన గాంధీ మహాత్ముఁడు సమస్త భారత జన సంతాప నివారణార్థమై "సహాయ నిరాకరణ మహాస్త్రరాజ

ము”ను సంధించినాఁడు. ఇంక మనము వగవంబనిలేదు. నీకుఁ ద్వరలో సౌఖ్యంబు చేకూఱఁగలదు. ఈ గాంధి యవతార పురుషుడని యెఱుంగుము.

తే॥ గీ॥ వరసు ధర్మముల్ నశియించి ♦ బఱగుచున్న
భరత భూమికిఁ దొల్లింటి ♦ వైభవంబు
వెలుగఁజేసి ధర్మంబు స్థాపించు కొఱకు
వాసుదేవుండె గాంధియై ♦వరలినాఁడు.

గాం — (పాంచాలినిఁ జూచి) ఓ పాంచాల రాజ్యమాతా! నీవు జరిగిన పరాభవమునుగూర్చి చింతింపకుము. విధికృతమున నిది జరిగినది. ఇప్పుడు వగచినను బ్రయోజనము లేదు. భరతభూమి తొల్లింటి వైభవమునంది సుఖించు దినములు త్వరలోనే వచ్చును. నీవును ముదం బందఁగలవు.

పాం — ఓ భరతమాత తపఃఫలమా! గాంధీ! నీ కరుణా విశేషమున నేనింక కృతార్థురాల నగుదును. నీ వన్నిదిక్కులను జూచి యా యాదిక్కుల నుండి వినవచ్చుచున్న నీ దేశీయుల యార్తనాదములు వింటివి. ఇంక నొక్క క్షణమైన నుపేక్షింపరాదని యాత్మనిగ్రహ మలవఱచుకొని శాంతమూర్తివై స్వాతంత్ర్య యుద్ధమునకుఁ గడంగితివి. దౌర్జన్యరహిత మగు సహాయ నిరాకరణోద్యమమును బ్రజా సమూహమునందుఁ బ్రవేశపెట్టితివి. భారతభూమికి దౌర్జన్యరహితమైన శాంతభావము నందే మోక్షముగలదను పరమరహస్యమును నీవు గ్రహించితివి. ఇంక, నీవు తలపెట్టిన దౌర్జన్యరహితమైన యసహాయోద్యమము వలననే భరతవర్షమునకు స్వరాజ్యము నార్జించుము. నీదేశీయ సోదరులను స్వరాజ్యధ్వజము క్రిందివి. శాంతిఁ దీసికొనునట్లుచేసి, సుఖములఁ గూర్చి యశంబందుము.

భ-మా-వత్సా! గాంధీ! నేను నీకుఁ జెప్పవల విషయ మెద్దియు లేదు. సమస్తము నీకుఁ దెలిసియేయున్నది. భారతీయులందఱును. నిన్ను నమ్ముకొనియున్నారు.

భర-పు-సీ॥ అమరవైరుల వధా ♦ నంతరంబున రామ
భద్రుండు నృపతియై ♦ బరగునాడు
తనవిరోధులదున్మి ♦ ధర్మరాజేంద్రుండు
హస్తినాపురపీఠి ♦ నలరునాడు
కలినిగ్రహముజేసి ♦ లలితగుణుడు పరీ
క్షితు పట్టభద్రుడై ♦ చెలఁగునాడు
సద్ధర్మమును నిల్పి ♦ జనమేజయుడు ధరా
భారంబు భుజపీఠిఁ ♦బఱపునాడు

తే॥ గీ॥ భారతీయు లెట్టి ముదము ♦ భావములను
బూనియుండిరో యట్టి స ♦ మ్మోద మిపుడు
గోరి భారతమాతను ♦ గొల్వుడయ్య
శుభము జేకూరు మీకునో ♦ శూరులార.

సీ॥ హిందూముసల్మాను ♦ లేక రీతి మెలంగ
నేలిన యక్బరు ♦ కాలముననను
స్వీయదేశము సుఖ ♦ స్థితినందఁ జేయు ను
ద్దండు లౌరస పుత్రు ♦ లుండునాడు
మహారాష్ట్రరాజ్యంబు ♦ మహినిసంస్థాపించి
పరిఢవిల్లిన యా శి ♦ వాజినాడు
దిగ్విజయ మొనర్చి ♦ దివ్య యశంబంది
శ్రీకృష్ణరాయలు ♦ చెలగునాడు

తే॥ గీ॥ ప్రజలకెట్టి యుత్సాహంబు ♦ బ్రబలియుండె
నట్టి యుత్సాహ మిపుడు మీ ♦ రాత్మఁగోరి

మాతృదేశము గావగా ♦ మహిత యత్న
ములను జేయుడీ తప్పక ♦ పూజ్యులార.

సీ॥ అరులను విదళించి ♦ యా కృష్ణరాయలు
దిగ్జయస్తంభ మె ♦ త్తించునాడు
కవులను నెనమండ్ర ♦ గరిమనిల్పి కవితా
సతికి వివాహంబు ♦ సలుపునాడు
తనపాలనంబున ♦ ధర్మంబు నెప్పుడు
నాల్గుపాదంబుల ♦ నడుపునాడు
జాతీయవిద్యలు ♦ జాతీయ కృషులును,
సకల స్థలంబుల ♦ నిలుపునాడు

తే॥ గీ॥ నార్యసంతతి కేకీర్తి ♦ నాత్మలందు
ముదము జేకూరె! నట్టి స ♦ మ్మదము నేడు
గోరి మాతృదేశంబును ♦ గొలువు డయ్య
దివ్యగుణులార ఘన భారతీయులార.

సీ॥ మనుమసిద్ధి ముదంబు ♦ గన బ్రాహ్మణుడు ఖడ్గ
తీక్ష్ణన వైరులఁ ♦ జెక్కునాడు
బాలచంద్రుడు మేటి ♦ పల్నాటి రణమున
శౌర్యంబు శోభిల్ల ♦ సల్పునాడు
ఆంధ్ర వీరుండైన ♦ యనపోత ఘనశత్రు,
జనులను నెదిరించి ♦ పెనగునాడు
శ్రీయయ్యు రుద్రాంబ ♦ శిష్టులు మెచ్చ దే.
శద్రోహులకు శిక్ష ♦ సలుపునాడు

తే॥ గీ॥ ఎట్టి యావేశమునుబూని ♦ యెసగినారొ
యట్టి యావేశమిప్పుడు ♦ నాత్మలందు
దాల్చి పనిసేయుడీ పట్టు ♦ దలనుబూని
పూజ్యగుణులార భారత ♦ పుత్రులార.

గాంధి—(భరత పుత్రునిఁజూచి) భరతపుత్రా! అట్టిదీక్షనే మేమిప్పుడు బూనినాము. (భారతమాతనుజూచి) తల్లీ! మన దేశాభ్యుదయ మంతయు రాట్నములమీదనే నిలచియున్నది. పూర్వము భరత ఖండముననున్న రాట్నములన్నియు మూలఁబడినవి. అవి పునరుద్ధరింపఁ బడినఁగాని భరతవర్షము పూర్వౌన్నత్యమును బొందదు. ఈ రాట్నమే స్వరాజ్య ధ్వజస్థాపనకుఁ గారణమగును. ముందుగా నట్టి రాట్నములు ప్రతియింట నుండునట్లేర్పాటుజేసి దానిపై నొడికిన నూలు చేతనే నేయించిన వస్త్రములను మన దేశీయులు ధరించునట్లొనర్ప వలయును. ఈ విషయమును చాలామంది యాచరణములోఁ బెట్టు చున్నారు. అది సంపూర్తిగ వృద్ధిఁ బొందవలెను. మనము స్వరాజ్య సౌధము నెక్కుటకిదియే ప్రథమ సోపానము. (ఇంచుక యూరకుండి) తల్లీ! ఇంక మేము పోయివచ్చెదము.

భర-మా-నాయనా! గాంధీ! పోయివచ్చెదవా! ఇంక నేను చెప్పవలసిన దేమున్నది!.

సీ॥ పంజాబు వీరులు ♦ పట్టుదలనుబూని,
పనిసేయువారిగాఁ ♦ బరగఁజేసి
రసపుత్రశూరులు ♦ రాష్ట్రాభివృద్ధికై
యత్నముల్ గావించు ♦ నట్లొనర్చి
అల మరాటాధీరు ♦ లంచిత ముదమున
నన్ని కార్యములు జే♦యంగఁజూచి

హిందూ ముసల్మాను ♦ లేకమై యుండెడి,
జాతీయ భావంబు ♦ జాటగలిగి

తే॥ గీ॥ లోకులెల్లరు మెచ్చంగ ♦ ప్రాకటముగ
భరతధాత్రి స్వరాజ్యంబు ♦ త్వరితగతిని
బడయునట్లు నియసహాయ ♦ వర్తనంబు
చేత జేయంగ గదవయ్య ♦ శిష్టచరిత.

శా॥ నీ మార్గంబఖిల ప్రపంచము గదుర్ ♦
వీక్షించి మోదింపగా
నీమార్గంబు దలంప దుర్మతుల కెం ♦
తే భీతి సంధిల్లగా
నీ మార్గంబిల భారతాత్మజులకున్ ♦
శ్రేయంబులఁగూర్ప ను
ద్దామప్రక్రియ సంచరింపు కొడుకా ♦
ధైర్యంబు రాజిల్లగన్.

మ॥ జనులెల్లన్ భవదీయ సౌఖ్యమును ని ♦
చ్చల్గోరఁగా; సత్కవుల్
నినుఁ సంస్తోత్రముసేయ వైరితతియున్ ♦
నీపేరు నాలింప నె
మ్మన మందున్ భయమంద; దీక్షఁగొని స ♦
న్మార్గంబునన్ మాకు నీ
వనుమానింపక గూర్పుమీ యిక స్వరా ♦
జ్యశ్రీని సత్పుత్రకా.

గాంధి—(లజపతిరాయి మొదలగు వారినిఁజూచి) మిత్రులారా! యిక
మన మరుగుదము. రండు.

(అందఱు నాభరతమాతకు నమస్కరించి నిష్క్రమింతురు).

రంగము:—బహిరంగ ప్రదేశమున; ఉపన్యాసవేదిక
పైన దేశభక్తుఁడు ప్రవేశము:—ఉపన్యాసము వినుట కనేక
మంది సభ్యులు గూడియుందురు.

దేశ—

(నరసారావుపేట పట్టణకాంగ్రెసు సంఘమువారు ప్రచురించిన
అసహాయోద్యమ గీతము.)

"భజనచేసే విధము తెలియండి" అనుమట్టుమాదిరిగాపాడవలెను.

౧ దేశమాతా సేవజేయండి - జనులారా, భారతదేశ
దాస్యము - తొలగ ద్రోయండి - దేశభాగ్యము చూరగొన
గా, లేశ మనుమానింపకన్నూ, పర - దేశవాసులు చేయు,
మాయా పాశములబడి నాశమొందక॥ దేశమాతా॥

౨ దేశవస్త్రంబులనె తాల్చండి - జనులార మీరు
విదేశవస్త్రము లంటబోకండి - దేశనాశనకరములగుని వేష
బాసలరోసి మోహా - వేశమును బరిమార్చి గాంధ్యుప దేశ
మును మీ మదిని నిల్పియు॥ దేశమాతా॥

౩ భోగముల గాంక్షించబోకండి - స్వరాజ్యప్రాప్తికి
త్యాగమును గావింపబూనండి - నాగపుర కాంగ్రెసులోపల

బాగుగా మనభారతీయుల - చే గనుంగొనబడిన పద్ధతి సాగ జేయుట గుర్తెరింగియు॥ దేశమాతా॥

౪ సందియంబులు చెందబోకండి - స్వరాజ్య మదిగో తొందరగ చేకూరగలదండి - అందరును గార్దన్య రహితంబైన నసహాయోద్యమములో - ముందు జేరియు భక్తితోడుత వందె మాతరమని పఠించుచు॥ దేశమాతా॥

౫ మనకుగౌరవత లేనెలేదండి - పాశ్చాత్య మోహమ్మునను మునిగి తెలియరేమండి - కనడా మరి యాఫ్రికా దిఖండములలో నుండువారలు - మనల బానిస లనుచు డెందమునను దలంచి హసింతురట యిక॥ దేశమాతా॥

౬ * * * * *

౭ అంటరాని తనమెలేదండి - మనదేశవాసుల నందరని నొకరీతి జూడండి - కంటికగపడు నిమ్నజాతుల నంటు కొన్నను దోసమనుచును - కంటగింపక కూర్మిమై మీ వంటి వారని మదిదలంచుచు॥ దేశమాతా॥

౮ పాలుమాలిక జెందబోకండి - జాతీయవిద్యా పద్ధతిని యోచించరేమండి - చాలగను జాతీయవిద్యా శాలలను

ప్రతిచోట నిల్పియు - బాలబాలికలను చదువుల బాగుగా నేర్పించి మీరలు॥ దేశమాతా॥

౯ తగవులన్నీ మానవలెనండి - సర్కారుకోర్టుకు తగుదుమని యిక సాగబోకండి - తగినపెద్దలు చెప్పుపగిదిని జగడము పేదీర్చుకొనుచును - జగతిమెచ్చగ నైకమత్యము చాలసంపాదించి మీరలు॥ దేశమాత॥

౧౦ ధరనహింసా వ్రతము బూనండి - తిరుగనరి వెంకట నరస సూరి బోధ వినరండి - గరిమతో సారాలు మొదలగు నైపువస్తువులన్ని విడిచియు - స్థిరమనంబున మీధనంబును "తిలకు స్వరాజ్యనిధి"కొసంగియు॥ దేశమాతా॥

మహాజనులారా! మన కిప్పుడు గావలసి యున్నది స్వరాజ్యము. పంజాబు ఖిలాఫతు అన్యాయములను దొలగించి, స్వరాజ్యమును సంపాదించుటకు భారతజాతి కృతనిశ్చయమై యున్నది. ఈ విషయమునుగూర్చి మహాత్ముం డిట్లు వ్రాసియున్నాడు

"సంవత్సరము లోపలనే స్వరాజ్యము సంపాదించుటకు డిశెంబరు కాంగ్రెసుసభ తన యుద్దేశమును బయల్పఱచెను. అందుచే, నీ మార్గమునం దెక్కుడు ప్రయత్నముల నాచరించుటకు, మనమున్నూ జేయవలసియున్నాము. పాఠశాలల, న్యాయస్థానముల బహిష్కారోద్యమము కొనసాగుచున్నది. ఇందుకు ప్రత్యేకప్రయత్న మవసరము లేదు. వీనిని విసర్జించినవారే ఆ పను అను సలుపగలరు. తమకాలము నెట్టుల వినియోగించు చున్నారో వారు ఆత్మపరీక్ష గావించుకొన వలెను. కాని, మనము ప్రత్యేక ప్రయత్నముల గావింపదగిన విషయములు, ఆరు గలవు.

(1) ముందుగ మనను మనము జయించుకొని, సంపూర్ణ శాంతియు తోను, సుహృద్భావముతోను నిండిన వాతావరణమును సృజింపవలెను.

ఎవరియెడల నయినను జేసిన అపకారమునకును, తెలియకుండ నుచ్చరించిన పరుషవాక్యములకును క్షమాపణ గోరవలయును.

(2) మన హృదయముల నింకను పరిశుద్ధము గావించుకొనవలెను. హిందువులును, మహమ్మదీయులును ఒండొరుల యుద్దేశములగూర్చి అనుమానముతో మెలగగూడదు. ఒకరికొకరు అపకృతి గావింపజాలరని, విశ్వసింపవలెను.

(3) హిందువులగు మనము, ఎవరినయినను అపవిత్రులనిగాని, నీచులనిగాని, తక్కువవారనిగాని పిలువజనదు. నిమ్నజాతుల నందుచే అస్పృశ్యులుగ నెంచగూడదు. సోదరమానవుని అస్పృశ్యునిగ నెంచుట పాపమని యెరుంగవలయును.

పై మూడు విషయములును ఆంతరంగిక వర్తనమునకు సంబంధించినవి. అనుదిన వ్యవహారములలో వీని పర్యవసానమును కనుగొనవచ్చును,

(4) నాల్గవది, త్రాగుడుశాపము. అదృష్టవశమున హిందూదేశ మీశాపమునుండి తప్పించుకొనుటకు బుద్ధిపూర్వకముగ ప్రయత్నించుచున్నది. ఆవారములో కల్లునమ్మెడి వారిని లైసెన్సులను వదలుకొనవలెననియు, అలవాటుబడి త్రాగెడి వారిని తమ యలవాటును మానివేయవలయుననియు: వినయముతో బ్రతిమాలవలెను. ప్రతిజాతికిని, తమలో నెవ్వరి దురభ్యాసమునకు పాల్పడుచున్నారో తెలియును గాన, వారి నామార్గమునుండి మరల్చుటకితరులకన్న నాజాతియే యెక్కుడు ఫలప్రదముగ పనిజేయగలదు. ఈపనిలో, దౌర్జన్యము నేమాత్ర ముపయోగింపగూడదు. అటివారిని శాంతముతో లాలన జేసినచో, విజయము బడయవచ్చును.

(5) ప్రతి గృహమునందును రాటమును నెలకొల్పి దేశీయ వస్త్రముల నెక్కుడుగ నుపయోగించి, విదేశవస్త్రముల పూర్తిగ వర్జింపవలయును.

(6) తిలకు స్వరాజ్యనిధి కెడతెగకుండ చందాలను వసూలు జేయవలయును

జనులారా! గాంధిగా రేర్పఱచిన నియమముల వింటిరికదా.— మఱి యొక విషయము 1921 సం॥ ఏప్రిల్ నెల 15 తేదీని ఆంధ్ర పత్రికలో "షొత్వాభావము" అను శీర్షికలో వ్రాయబడిన కొన్ని యంశముల నిట వచించెదను.

"విద్యార్థులు త్రొక్కిన త్రోవ నితరులు సులభముగ ననుకరించెదరు. అందుచే, త్యాగారాధనయందు విద్యార్థులు ముందడుగు వేయవలయునని కాంగ్రెసు సభ ముందుగ నిరూపించెను. దాని ననుసరించి, శాసనసభల బహిష్కారమునకు జేసిన ప్రయత్నములు చాలవరకు జయముగాంచెను. శాసనసభలు, ప్రజాప్రతినిధి సభలని యిప్పుడెవరును భ్రమపడుటలేదు. వాని గౌరవము పూర్తిగా దగ్గిపోయినది. న్యాయవాదులు కొందరు తమ వృత్తిని విసర్జించిరి. లాకోర్టుల ప్రతిష్ఠ తగ్గిపోయెను. విద్యార్థులనేకులు పాఠశాలలను బహిష్కరించిరి. పలుతావుల జాతీయ పాఠశాలలు నెలకొనుచున్నవి. ఇంకను ఈ విషయమై జరుగవలసిన పని విశేషమున్నను, వృత్తిని విసర్జించిన న్యాయవాదులును, చదువును చాలించిన విద్యార్థులును, ఇతరులను కార్యశూరుల జేయుటకు ప్రోత్సాహము చేయగలుగుదురు. కార్యరంగమునకు దిగనివారు సయితము తమ యసమర్థతకు చింతించుచున్నారుగాని, అట్టి ప్రతిష్ఠాపనలజూచి గర్వపడుటలేదు. ఈ కారణముచే, మొదటి యంతరము సంతృప్తికరముగ గడిచెనని, గాంధిమహాత్ముడభిప్రాయపడెను. దీని నింకను కొనసాగించుటకు కొంత ప్రయత్నములు సహజముగా జరుగుచునే యుండును. ఇకమీద నిరాకరణ కార్యక్రమమునందలి రెండవ యంతరముపై, భారతజాతి తన దృష్టిని మరల్పవలయునని గాంధి గారు

యుండెను. మొదటి యంతరము జరుగుచున్నప్పుడు, విద్యార్థులకన్నను యితరులగు ప్రజలు అద్భుతోత్సాహము గనుబఱచిరి. శాసనసభల బహిష్కారముపట్ల, ప్రజాసామాన్యము చూపిన కార్యోత్సాహము, ప్రశంసార్హముగ నుండెను. ఆ యుత్సాహమును సరియగు హద్దులలోనుంచి, దానిని కార్యరూపమున ప్రవహింప జేయవలసిన యావశ్యకత విశేషముగ గలదు. ప్రజల కార్యదీక్ష బలపడెనేని, స్వరాజ్య సిద్ధి నెవరు ఆటంకపఱుప జాలరు. మొదటి యంతరము, వ్యతిరేకపద్ధతిని మాత్ర మాశ్రయించెను. రెండవయంతరము, నిర్మాణమున నాశ్రయింప వలెను. అందుచే, కాంగ్రెసు సంఘమువారు, ప్రజాసామాన్యములో నీయుద్యమమును వ్యాపింప జేయుటకు, రెండవ యంతరమును దలపెట్టిరి.

స్వరాజ్య సంపాదనమునకు, ప్రజల దృఢనిశ్చయము స్థిరపడవలెను. ఇందుకొరకు విశేష సంఖ్యాకులు, కాంగ్రెసు సంఘములలో జేరవలయును. ధనము లేదని ఏపనిని కొనసాగించుటయు కష్టముగాన, ధనమును విశేషముగ ప్రోగుచేయవలెను. సామాన్య ప్రజ లిచ్చెడి ద్రవ్య మెంతస్వల్పమయినను, దాని కెక్కుడు విలువగలదు. తామిచ్చెడి ద్రవ్యము స్వరాజ్యమును చేకూర్చు నని ప్రజలు గ్రహించుటచే, స్వరాజ్యసంకల్ప మెల్లర హృదయములలో బలపడును. ప్రజలలో గల స్వతంత్రశక్తిని పెంపొందించుటకును, స్వసామర్థ్యమునువారు గ్రహించునటుల జేయుటకును రాటములుపయోగపడును. [illegible]రకును, తిండియు, బట్టయు ప్రధానముగ గావలయును. వానికొరకితరులపై నాధారపడి యుండకబోవుటయే, నిజ స్వరాజ్యమగుచున్నది. ప్రజల యిక్కట్టులు దీరి, పరాశ్రయభావము దొలగిపోయి, దుర్భర దారిద్ర్యము

పోసిపోయిన వెంటనే, స్వరాజ్యము సిద్ధించును. రాటములు స్వరాజ్యమిచ్చుననుట కిసుమంతయు సందియములేదు. ప్రజల స్వతంత్రశక్తి నిశాకరణ కార్యక్రమమునందలి రెండవ యంతరమువలన, ప్రజ్వలితపగ్గలదు. ఈవిధమున ప్రజల యుత్సాహ మొకరూపము దాల్చినపిమ్మట, వారిని ధర్మపథమున నడుపుట సులభసాధ్య మగును.”

* * * *

నిశ్చయముగా గాంధి మహాత్ముఁడు చెప్పినట్లు మనకు స్వరాజ్యప్రాప్తి రాట్నములమీదనే యాధారపడి యున్నది. ఈ రాట్నముల పరిశ్రమ యొక్క పురుషులకేగాదు, మన భారతజాతియందుఁ గొందరు స్త్రీలు గృహముల విడిచి యవ్వలికిబోయి కూలిఁజేసికొని జీవింపవలసి వచ్చుచున్నది. ఈ రాట్నములు గృహములయందు నిలుపుకొన్నచో వారు గృహములవిడిచి యావలకుబోవ నవసరములేదు. ఈ రాటమే వారికిఁ గూడును, గుడ్డయు నిచ్చును; ఈ రాటముల పరిశ్రమము వలననే మనము స్వరాజ్యమును గాంచవలయును. ప్రతియింటను రాటముల గానము వినఁబడ వలయును. ఈ రాటము యొక్క రహస్యమును మీరు బాగుగ నెఱుఁగుఁడు,

మోహన - ఏకతాళము.

“ధాసరిగగ - గాగగగా - రిరిసస - ధాసారిరీ ధా॥
గాగసాధ - సాససాస - గాధపా గధపగరిసా॥
భారతులకువాటము సం - పదలకు బొహాటము
పారతంత్ర్యమున కయః క-వాటమీ రాటము
మోసగించి కోట్లధనము - బొట్టఁబెట్టుకొనెడునా వేన

గాంధ్రకెల్లరకుఁ జపేటమీరాటము॥ ౨॥

* * * *

భారతీయ శాస్త్ర సూక్తి పాఠమీరాటము - వేరచించు మోక్షరాజ్య పీఠ మీరాటము॥ ౫॥" (హితకారిణి పత్రిక)

నేఁ త దం డ క ము.

రెండు వేలేండ్లకు మున్నుందుగా భారతీయుల్ జలంబాతగా లేని రేగళ్లలోఁ బ్రత్తి పండించుచున్ నూలు రాట్నంబులన్ సన్నపుం దారముం దోడి యానూలుమగ్గాన గారంపుఁ బడ్డి మృగాఁజేసి కూర్పాసముల్లాగ నొప్పారు మేల్వల్వలన్నేయుచున్ బారసీకాది రాజ్యాలకుం బంపఁగా హర్షముం బొందుచుం బారసీకుల్ధరింపంగ గ్రీకుల్సహింపంగ లేఁట్టి రాజ్యంబులన్వ్యాపి యావర్తకం బంతియుం సంగ్రహింపంగ నీరీతిగాఁ గొంత కాలంబు పో రోమకుల్ గ్రీకురాజ్యంబుతో వర్తకంబంతయుం గాంచఁగా నొప్ప నీచేతనేతల్ క్రమం బొప్పఁగా మౌర్య గుప్తాదులా చక్రవర్తుల్ దయంబ్రోవ వర్ధిల్లి ఖిల్జీలు తగ్లాకులుం మొఘలుల్ దోహదాల్ సేయఁ బెంపొందియుం వర్తకార్ధంబుగాఁ దొల్లినిచ్చేయు నాయింగిలీసుల్ ప్రభుత్వాప్తి నొప్పార యంత్రంబులన్పెద్ద రాకాసులొప్పారు నాసీమ దేశంపు

...ాల్ వర్తకాల్ సాగ నిర్మూలితంబైన మీనేత వేవేగమే ...ల్పుడిట్టి ప్రత్తిపండింపఁగాఁ గల్గు రేగళ్ళు పోలేదు కాంభోజ ...ం బ్రత్తిపండింపుఁ డీదేశమందిప్డు కోటీశ్వరుల్ పెద్దలున్నారు ...ాలీల లెక్కింపగా శక్యమా! అట్టిచో మూలముల్ వడ్డి ...యుల్ గూలియుల్ లాభ మీదేశమందుండుభంగుల్ దగన్ ...కట్టి దేశాభిమానంబు జూపించుచున్ బ్రత్తిఁబై దేశమంపంగ ...ూల్పట్టలందేరనా కర్చులందిగ్మతిపన్నులన్ మాన్ప మీరెల్ల ...ం బ్రత్తి రాట్నాలతో గింజలం దీయుచు న్నేకులం జేయు ...మున్ నూల్ రాట్నాలతో నేకులన్ వడ్కి దారంబులన్ దోడు ...ముల్ గుంచెతోఁ జిక్కులన్ దీయుచున్; కండెలంజుట్టి మగ్గాన ...ారంపుఁబడ్డుం దగం జేయుచున్ గండె నీచక్కి యాచక్కిఁ ...ోఁద్రోయుచున్ పేకదారంబుల న్నేయుచున్ బల్కతో ...ట్టిగా నడ్డు దట్టించి నూల్ బట్టలన్నేసి యవ్వానినేకట్టఁగా ...త్రఁబూనుండు ముమ్మాటికిం దేశలాభంబు హస్తంగతంబై ...రాజిల్లెడిన్ దేశమాతా నమస్తే నమస్తే నమః॥

ఎంతచెప్పినను స్వరాజ్య ప్రాప్తికై పట్టుదలఁబూని పనిసేయవలయునను మాటతప్ప మఱొక్కటి లేదు.

సీ॥ పరదేశములనుండి ♦ వచ్చువస్త్రంబుల
ధరియింప కుండుడీ ♦ ధన్యులార
మీదు సంతతికిని ♦ మేలైన జాతీయ
విద్య గఱపుఁడు వి ♦ వేకులార

ప్రతిచోట వీథులైన ♦ వఱకు జాతీయ వి
ద్యాలయంబులు నిల్పు ♦ డార్యులార
వీరవారికి ముడి ♦ వెట్టి "ఫీజు" నకయి
యరుగవలదు కోర్ట్లు ♦ కనఘులార
బ్రాహ్మణా బ్రాహ్మణా ♦ భావంబు నెప్పుడు
మఱచి చరింపుడు ♦ మహితులార

తే॥ గీ॥ మనల వీక్షించి భారత ♦ మాతమిగుల
వగచుచున్నది యద్దేవి ♦ వగపుఁ బాపి
సకల సుఖములఁ బడసి య ♦ శంబు గనుఁడు
మాన్యులార హిందూ ముస ♦ ల్మానులార.

సీ॥ పంజాబువధలచే ♦ భావంబులను గల్గు
నమిత దుఃఖాగ్నిచ ♦ ల్లారువఱకు
అల ఖిలాఫత్ సమ ♦ స్యావిషయము పూర్తి
యై తురుష్కులు ముదం ♦ బందువఱకు
సత్యాగ్రహవ్రత ♦ స్థాపనంబున మన
కును స్వరాజ్యంబు చే ♦ కూరువఱకు
మనభూమి తొల్లింటి ♦ మహితభాగ్యములంది
వైభవంబునఁదాను ♦ వరలువఱకు

తే॥ గీ॥ నేకదీక్షను బనిజేసి ♦ యొసగుఁడయ్య
మహమ్మదీయులు మీరును ♦ మైత్రిఁదగిలి

ధరను ధా, ర్జన్యరహితప ♦ థంబునందు
భూరిగుణులార భారత ♦ పుత్రులార.

(జనులు) గాంధీమహాత్మునకు జయ్ అని కేకలు వేయుచున్నారు.

(తెరవాలును.)

తృతీయాంకము:—

సర్వము సంపూర్ణము.

END OF TITLE